శుక్రవారం
29-09-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 99
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కెనడా ప్రధాని ట్రుడో బహిరంగ క్షమాపణ

నాజీల తరపున పోరాడిన వ్యక్తిని దేశ పార్లమెంటులో హీరోగా పొగిడినందుకు కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో క్షమాపణలు చెప్పారు. ఆ వ్యక్తిని గుర్తించడంలో ఘోర తప్పిదం జరిగిందని.. నాజీ పాలనలో నష్టపోష్ట యిన వారి చేదు జ్ఞాపకాలను విస్మరించినట్లు అయిందని విచారం వ్యక్తం చేశారు.

2 లో

విద్య, ఉపాధికి శత్రువు కేంద్రం

విద్య కాషాయీకరణ అంగీకరించం

విద్యావ్యవస్థ రక్షణ విద్యార్థుల బాధ్యత

ఏఐఎస్ఎఫ్ జాతీయ మహాసభలో డి.రాజా

బెగుసరాయ్: విద్య, ఉపాధికి మోదీ సర్కారు బద్ధ శత్రువని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. 2014 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని బీజేపీ నాయకులు హామీలు గుప్పించారని, ఆ హామీ అమలు చేయడానికి బదులు మోదీ సర్కారు ఉన్న ఉద్యోగాలు పీకేసిందని మండిపడ్డారు. ఏఐఎస్ఎఫ్ 30వ జాతీయ మహాసభ సందర్భంగా గురువారం బెగుసరాయ్‌లోని జీడీ కాలేజీ మైదానంలో జరిగిన బహిరంగ సభలో డి.రాజా ప్రసంగించారు. విద్యను కాషాయీకరణ చేయడానికి కేంద్రం విశ్వప్రయత్నం చేస్తోందని, అందులో భాగంగా యూనివర్సిటీలను తమ గుప్పెట్లో పెట్టుకుంటుందని రాజా చెప్పారు. చాన్సలర్ హోదాలో గవర్నర్లు వర్సిటీలపై పెత్తనం చెలాయిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వాల పాత్రను పూర్తిగా పక్కన పెడుతున్నారని చెప్పారు. విద్య, ఉద్యోగ, ఉపాధిపై ఏమాత్రం శ్రద్ధ వహించడం లేదని విమర్శించారు. దేశ సంపదను తన అనుంగు మిత్రులైన అదానీ, అంబానీలకు దోచిపెడుతోందని చెప్పారు. విమానాశ్రయాలు, పోర్టులు, విద్యుత్ కేంద్రాలను అదానీకి అప్పనంగా కట్టబెడుతోందన్నారు. ఈస్టిండియా కంపెనీ

పేరుతో బ్రిటీష్ పాలకులు భారత్‌ను ఆక్రమించుకున్న చందాన అదానీ, అంబానీలు కూడా భవిష్యత్‌లో దేశంపై పెత్తనం చేస్తారని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలలను స్వయానా పాలకులే అంతం చేస్తున్నారని, కార్పొరేట్ చదువులను ప్రోత్సాహిస్తున్నారని ఆరోపించారు. ఇది ప్రజాప్రభుత్వాలు చేయాల్సిన పని కాదని హితవు పలికారు. ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ సర్కారు నిర్వీర్యం చేస్తోందని, ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు ఆ పరిశ్రమలను ఉద్దేశపూర్వకంగా దివాలా తీయిస్తున్నదని విమర్శించారు. మోదీ ప్రభుత్వం రానున్న రోజుల్లో దేశాన్నే అమ్మకానికి పెట్టే ప్రమాదం ఉందని రాజా హెచ్చరించారు. మోదీ ప్రభుత్వ హయాంలో దేశంలోని యూనివర్సిటీలు, విద్యాసంస్థలన్నీ అస్తవ్యస్తంగా మారాయన్నారు. దేశంలోని విద్యా సంస్థలను కాపాడాల్సిన బాధ్యత ఉద్యమాల చరిత్ర గల ఏఐఎస్ఎఫ్‌పై ఉందని రాజా స్పష్టంచేశారు. కేంద్రం తీసుకొచ్చిన జాతీయ విద్యావిధానాన్ని విద్యార్థిలోకం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు చదువు కోవాలని సూచించారు. విద్యారంగాన్ని పరిరక్షించుకోవడం కోసం ఉద్యమాలను ఉధృతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మాజీ ఎంపీ శత్రుఘ్న ప్రసాద్ మాట్లాడుతూ మోదీ హయాంలో విద్యా ప్రమాణాలు మరింత క్షీణించాయని విమర్శించారు. లెక్చరర్లు, కాలేజీ విద్యార్థుల పట్ల సవతితల్లి ప్రేమ చూపుతోందని మండిపడ్డారు. గతంలో భారత విద్యావ్యవస్థ ప్రపంచంలోనే అత్యుత్తమంగా ఉండేదని గుర్తుచేశారు. నూతన విద్యావిధానంతో విద్యా ప్రమాణాలు పడిపోయాయన్నారు. దేశానికి శాస్త్రీయ విద్యావిధానం అత్యవసరమని స్పష్టంచేశారు. బెగుసరాయ్‌లోని దింకర్ యూనివర్సిటీని కేంద్రం సర్వనాశనం

- మిగతా 2 లో

ఎంఎస్ స్వామినాథన్

కన్నుమూత

రేపు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

రాష్ట్రపతి, ప్రధాని ప్రభృతుల నివాళి

చెన్నై: భారతదేశ హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ గురువారం ఉదయం చెన్నైలోని తన నివాసంలో కన్నుమూశారు. ఆయన వయసు 98 సంవత్సరాలు. ఆయనకు భార్య మీనా, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెల పేర్లు సౌమ్య స్వామినాథన్, మధుర స్వామినాథన్, నిత్యా స్వామినాథన్. స్వామినాథన్ 1925 ఆగస్టు 7న మద్రాసు ప్రెసిడెన్సీలోని కుంభకోణంలో జన్మించారు. ఆహార వృద్ధిలో భారత్ స్వయం సమృద్ధి సాధించేందుకు ఆయన విశేష కృషి చేశారు. అధిక దిగుబడినిచ్చే వరి రకాలను అభివృద్ధి చేయడంలో స్వామినాథన్ కీలకపాత్ర పోషించారు. ఇది భారతదేశంలోని తక్కువ ఆదాయం గల రైతులు ఎక్కువ దిగుబడిని ఉత్పత్తి చేయడానికి సహాయపడింది. స్వామినాథన్ 1987లో చెన్నైలో ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను స్థాపించారు. దాని ద్వారా ఆయన మొదటి ప్రపంచ ఆహార బహుమతి అందుకున్నారు. కాగా, స్వామినాథన్ అంత్యక్రియలు సెప్టెంబరు 30వ తేదీన జరుగుతాయని స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్

- మిగతా 2 లో

స్కిల్ కేసుపై

సుప్రీంలో కేవియట్

రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ టీడీపీ అధినేత చంద్రబాబు సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేస్తూ కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. చంద్రబాబుపై ఏపీ సీఐడీ నమోదు చేసిన కేసుపై అక్టోబరు 3వ తేదీన విచారిస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ప్రకటించారు. దీంతో గురువారం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో

- మిగతా 2 లో

మోదీ సర్కారు ఓటమికి

ఐక్యపోరు

'ఇండియా' ఆవిర్భావం కీలక ముందడుగు

లాలుతో భేటీ అనంతరం డి.రాజా వ్యాఖ్య

పాట్నా: భారతదేశ లౌకిక, ప్రజాస్వామిక స్ఫూర్తి పరిరక్షణ దిశగా ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చి 'ఇండియా' కూటమిని ఏర్పాటు చేయడం కీలకమైన ముందడుగుగా సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా స్పష్టంచేశారు. మోదీ సర్కారు వల్ల లౌకికవాదం, ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడిందని, ఈ సమయంలో విపక్షాలు ఐక్యం కావడం శుభపరిణామమని రాజా చెప్పారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ మహాసభల్లో పాల్గొనేందుకు బీహార్ వచ్చిన

- మిగతా 2 లో

లోకేశ్ 'యువగళం'

వాయిదా

పార్టీ ముఖ్యనేతల వినతిపై నిర్ణయం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర పునఃప్రారంభ తేదీ వాయిదా పడింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అరెస్టు, అనంతర పరిణామాల నేపథ్యంలో ఈనెల 9వ తేదీన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజోలు నియోజకవర్గంలో పాదయాత్ర నిలిపివేసిన విషయం తెలిసిందే. సెప్టెంబరు 29వ తేదీ రాత్రి 8.15 గంటలకు పాదయాత్ర తిరిగి ప్రారంభించాలని ముందు నిర్ణయించారు. కానీ అక్టోబరు 3న స్కిల్ డెవలప్‌మెంట్ కేసుకి సంబంధించి సుప్రీంకోర్టులో వాదనలు

- మిగతా 2 లో

జీపీఎస్‌పై మరో ఉద్యమం

బిల్లు ఆమోదంపై ఆగ్రహం

ఐక్య కార్యాచరణకు ఉద్యోగ, ఉపాధ్యాయులు సిద్ధం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అసెంబ్లీ సమావేశాల్లో జగన్ సర్కారు ఏకపక్షంగా ఆమోదించిన గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) బిల్లుకు వ్యతిరేకంగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మరో ఐక్య ఉద్యమ కార్యాచరణకు సన్నద్ధమవుతున్నాయి. జీపీఎస్ బిల్లు స్థానంలో పాత పెన్షన్ బిల్లును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నాయి. జీపీఎస్ బిల్లును ఆమోదించి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఆశలపై సర్కారు నీళ్లు చల్లిందని మండిపడుతున్నాయి. అసెంబ్లీలో జీపీఎస్ బిల్లు ఆమోదంతో 13 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బిల్లు ఆమోదంతో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. అధికారంలోకి వచ్చిన వారం

- మిగతా 2 లో

ఇదీ లోకం!

పంజాబ్‌లో రైతుల

ఆందోళనతో నిలిచిన రైళ్లు

అమృత్‌సర్/ఫిరోజ్‌పూర్ : పంజాబ్‌లో రైతుల ఆందోళన విజయవంతమైంది. మూడు రోజుల రైల్ రోకో ఆందోళనను ప్రారంభించిన రైతులు పెద్ద సంఖ్యలో రైల్వే ట్రాక్‌లపై ఆందోళన చేయడంతో గురువారం కనీసం 91 రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. ఇటీవలి వరదల వల్ల పంట నష్టపోయినందుకు ఆర్థిక ప్యాకేజీ, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కి చట్టపరమైన హామీ, భారీ రుణమాఫీ వంటి డిమాండ్లతో రైతులు తమ నిరసనను చేపట్టారు. రైల్వే అధికారుల ప్రకారం, ఫిరోజ్‌పూర్ డివిజన్ పరిధిలోని 91 రైళ్లలో 51 రైళ్లను రద్దు చేయగా, మరికొన్నింటిని మార్గం మళ్లించారు. సెప్టెంబరు 30 వరకు కేంద్రానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపడతామని ఆందోళనకారులు తెలిపారు. గురువారం మోగా, హోషియార్‌పూర్, గురుదాస్‌పూర్, జలంధర్, తరన్ తరణ్, సంగ్రూర్, పాటియాలా, ఫిరోజ్‌పూర్, భటిండా, అమృత్‌సర్‌లోని 17 చోట్ల రైతులు ఆందోళనకు దిగారు. అమృత్‌సర్‌లో, దేవిదాస్ పురాలో అమృత్‌సర్-ఢిల్లీ రైల్వే ట్రాక్‌పై రైతులు ఆందోళన చేశారు. కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ, భారతీ కిసాన్

యూనియన్ (క్రాంతికారి), బీకేయూ (ఏక్తా ఆజాద్), ఆజాద్ కిసాన్ కమిటీ దోబా, బీకేయూ (బెహ్రామ్‌కే), బీకేయూ (షహీద్ భగత్ సింగ్), బీకేయూ (చోటూ రామ్) సహా అనేక రైతు సంఘాలు ఈ నిరసనలో కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఉత్తర భారతదేశంలోని వరద బాధిత ప్రజలకు ఆర్థిక ప్యాకేజీ, అన్ని పంటలకు కనీస మద్దతు ధర లేదా ఎంఎస్‌పికి చట్టపరమైన

- మిగతా 2 లో

ఒకే ఘటన వాది, ప్రతివాది

న్యూఢిల్లీ: బీఎస్పీకి చెందిన ఎంపీ డానిష్ అలీపై బీజేపీ సభ్యుడు రమేశ్ బిధూడీ అభ్యంతరకర పదాలు వాడిన అంశంపై ఎంపీల ఫిర్యాదులను లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా హక్కుల కమిటీకి నివేదించినట్లు సంబంధిత వర్గాలు గురువారం వెల్లడించాయి. అలీతో పాటు కాంగ్రెస్ నాయకుడు అధిర్ రంజన్ చౌదరి, డీఎంకేకి చెందిన కనిమొళితో సహా కొంతమంది ఇతర ప్రతిపక్ష ఎంపీలు బిధూడీపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే డానిష్ అలీ సభలో మాట్లాడుతున్నప్పుడు నిషికాంత్ దూబే వంటి కొంతమంది అధికార బీజేపీ ఎంపీలు బిధూడీని రెచ్చగొట్టారని... ఈ అంశాన్ని కూడా పరిశీలించాలని స్పీకర్ దృష్టికి తెచ్చారు. బీజేపీ

- మిగతా 2 లో

కెనడా ప్రధాని ట్రుడో బహిరంగ క్షమాపణ

నాజీల తరపున పోరాడిన వ్యక్తిని పార్లమెంటులో పొగడటంపై విచారం

ఒట్టావా: నాజీల తరపున పోరాడిన వ్యక్తిని దేశ పార్లమెంటులో హీరోగా పొగిడినందుకు కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో క్షమాపణలు చెప్పారు. ఆ వ్యక్తిని గుర్తించడంలో ఘోర తప్పిదం జరిగిందని.. నాజీ పాలనలో నష్టపోష్ట యిన వారి చేదు జ్ఞాపకాలను విస్మరించినట్లు అయిందని విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన జరిగినప్పుడు కెనడా పార్లమెంటులో ఉన్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీకి దౌత్యమార్గాల్లో క్షమాపణలు చెప్పినట్లు ట్రుడో పేర్కొన్నారు. అసలేం జరిగిందంటే... రష్యాతో యుద్ధం మొదలైన తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఇటీవల కెనడాలో పర్యటించారు. గత శుక్రవారం కెనడా పార్లమెంటును సైతం సందర్శించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ ఆంటోనీ రోటా.. ఉక్రెయిన్ నుంచి వలస వచ్చిన రెండో ప్రపంచయుద్ధం మాజీ సైనికుడైన 98 ఏళ్ల యారోస్లోవ్ హంకాను ఆహ్వానించారు. పార్లమెంటును ఉద్దేశించి జెలెన్స్కీ మాట్లాడిన తర్వాత స్పీకర్ రోటా స్వయంగా హంకాను పరిచయం చేస్తూ... రెండో ప్రపంచయుద్ధంలో రష్యా నుంచి ఉక్రెయిన్‌కు స్వేచ్ఛను అందించడానికి పోరాడినయోధుడిగా హంకాను కీర్తించారు. వెంటనే ప్రధాని జస్టిన్ ట్రూడో, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సహా అందరూ చప్పట్లు కొట్టారు. అయితే.. కెనడా పార్లమెంట్ గౌరవించిన హంకా రెండో ప్రపంచయుద్ధంలో జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్ పక్షాన పోరాడిన.. 14వ వాఫన్ గ్రనేడియర్ డివిజన్‌కు చెం దిన వ్యక్తి అని తర్వాత తెలిసింది. హిట్లర్ తనపున పోరాడిన వాఫన్ గ్రనేడియర్ డివిజన్... అప్పట్లో పోలిష్, యూదులను చిత్ర హింసలు పెట్టి చంపినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం తెలిసిన వెంటనే.. రష్యా విమర్శలు ఎక్కుపెట్టిం ది. ఉక్రెయిన్‌లోని తమ శత్రువులను.. నియోనాజీలుగా పేర్కొంది. నాజీని పార్లమెంటుకు తీసుకురావడంపై కెనడాలోని ప్రతిపక్షాలు సహా వివిధ దేశాలు ట్రుడో ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించాయి. ఈ క్రమంలో రోటా స్పీకర్ పదవికి రాజీనామా చేశారు. అయినప్పటికీ వివాదం సద్దుమణగలేదు. యూదులకు ప్రధాని ట్రుడో స్వయంగా క్షమాపణ చెప్పాలని ప్రతిపక్షనేతలు పట్టుబట్టారు. హంకాను పార్లమెంటుకు తీసుకురావడం... కెనడా చరిత్రలోనే దౌత్యపరంగా అతిపెద్ద ఇబ్బం దికర పరిణామం అంటూ కెనడా ప్రతిపక్ష నేత పోయిలివ్రే విమర్శించారు. ఈ క్రమంలోనే కెనడా ప్రధాని ట్రూడో... బహిరంగ క్షమాపణలు చెప్పారు. శు క్రవారం జరిగిన ఘటనకు సభ తరపున.. బేషరతుగా క్షమాపణలు చెబుతున్నట్లు ప్రకటించారు. ఈ విషయంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీని ఆ దేశ ప్రతినిధి బృందాన్ని. దౌత్యమార్గాల ద్వారా సంప్రదించామన్నారు. ఆరోజున పార్లమెంటుకు వచ్చిన వ్యక్తిని గుర్తించడంలో ఘోర తప్పిదం జరిగిందని ట్రుడో వివరించారు. నాజీ పాలనలో తీవ్రంగా నష్టపోష్టయినవారి చేదు జ్ఞాపకాలను విస్మరించినట్లయిందని విచారం వ్యక్తం చేశారు.

ట్రంప్ వ్యాపారం మోసపూరితం

న్యూయార్క్ జడ్జి వ్యాఖ్య



న్యూయార్క్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అనేక మోసాలకు పాల్పడ్డారని న్యూయార్క్ న్యాయస్థానం జడ్జి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. న్యూయార్క్ అటార్నీ జనరల్ తీసుకొచ్చిన ఒక సివిల్ పిటిషన్‌ను జడ్జి ఆర్థర్ ఎన్గోరాన్ విచారించారు. ఈ కేసులో తీర్పు చెబుతూ... ట్రంప్‌తో పాటు ఆయన సంస్థలు బ్యాంకులను, బీమా సంస్థలను మోసం చేశాయన్నారు. తమ ఆస్తులను కాగితాల మీద భారీగా పెంచుకుని చూపించడం ద్వారా పెద్ద పెద్ద ఒప్పందాలు చేసుకోవడం, భారీ మొత్తాల్లో అప్పులు తీసుకోవడం వంటివి చేశారని జడ్జి పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ సామ్రాజ్యంతో ఆయనకు వచ్చిన జనాదరణే శ్వేతసౌధంలోకి వెళ్లడానికి ట్రంప్‌నకు బాటలు పరిచిందని తెలిపారు. ట్రంప్ సంస్థలకు చెందిన కొన్నింటి లైసెన్స్‌లను న్యూయార్క్ పరిధిలో రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తాను స్వతంత్రంగా వారి సంస్థల కార్యకలాపాలను పర్యవేక్షిస్తానంటూ హెచ్చరించారు. కాగా ఈ తీర్పును పైకోర్టులలో సవాలు చేస్తామని ట్రంప్ న్యాయవాదులు పేర్కొన్నారు.

భారతీయులకు లక్ష్యాన్ని మించి వీసాలు

వెల్లడించిన అమెరికా

న్యూఢిల్లీ: ఈ ఏడాది 10లక్షలమంది భారతీయులకు అమెరికా వెళ్లేందుకు వీసాలు జారీ చేయడం ద్వారా భారత్‌లో అమెరికా రాయబార కార్యాలయం సరికొత్త రికార్డు సృష్టించింది. 2023లో అన్ని రకాల వీసాలు కలిపి 10లక్షల వరకు జారీ చేయాలన్న లక్ష్యాన్ని అధిగమించినట్లు అమెరికా రాయబార కార్యాలయం వెల్లడించింది. "భారత్‌లో ఈ ఏడాది వీసాల ప్రక్రియలో మేం పెట్టుకున్న 'మిలియన్ వీసాల జారీ' లక్ష్యాన్ని దాటేశాం. అయితే, ఇక్కడితో మేం ఆగిపోం. రాబోయే నెలల్లో మరింత వృద్ధి సాధిస్తాం.

అమెరికాలో పర్యటించేందుకు మరింత మంది భారతీయులకు అవకాశం కల్పిస్తాం" అని రాయబార కార్యాలయం పేర్కొంది. దీనికి ఓ వీడియో కూడా జత చేసింది. ఆ వీడియోలో భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి మాట్లాడుతూ ఈ రికార్డుపై హర్షం వ్యక్తం చేశారు. 'మాకు ముఖ్యమైన దేశాల్లో భారత్ ఒకటి. ప్రపంచంలోనే అత్యంత కీలకమైన బంధం మాది. మా రెండు దేశాల మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతమైంది.

ఈ బంధాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు రాబోయే రోజుల్లో మరింత మంది భారతీయులకు రికార్డు స్థాయిలో వీసాలు అందజేస్తాం' అని గార్సెట్టి తెలిపారు. 2022 ఏడాది మొత్తంలో జారీ చేసిన వీసాలను మించి ఈ ఏడాది ఇప్పటికే వీసాలు జారీ అయ్యాయని అమెరికా రాయబార కార్యాలయం వెల్లడించింది. ఇక 2019 నాటితో పోలిస్తే ఇది 20శాతం ఎక్కువ అని తెలిపింది. ప్రస్తుతం అమెరికా ప్రపంచవ్యాప్తంగా జారీ చేసిన వీసాల్లో 10 శాతం భారతీయులకే దక్కాయి. ఇక విద్యార్థి వీసాల్లో 20శాతం, హెచ్, ఎల్ కేటగిరీ ఉద్యోగ వీసాల్లో 65శాతం భారతీయులకే జారీ అవడం విశేషం.

దిల్లీలో వడ్రంగి పనివారితో
రాహుల్ మాటామంతీ

న్యూదిల్లీ : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తాజాగా వడ్రంగి పనివారితో మాటామంతీ నిర్వహించారు. గురువారం ఇక్కడి కీర్తి నగర్ ఫర్నీచర్ మార్కెట్‌ను సందర్శించిన ఆయన వారి కష్టాలను తెలుసుకోవడంతో పాటు పనిలో పనిగా వారి తయారీ పనిలో భాగంగా రంపం పట్టారు. ఇటీవల కాలంలో దేశ రాజధానిలో గాంధీ ఇటువంటి కసరత్తు నిర్వహించడం ఇది మూడవది. ఆగస్టులో ఇక్కడి అజాద్‌పూర్ మండీలో కూరగాయలు, పండ్ల విక్రయదారులను కలిశారు. అలాగే, ఇటీవల ఆనంద్ విహార్ రైల్వే స్టేషన్ వద్ద కూలీలతో మాట్లాడారు. 'ఈ రోజు నేను కీర్తి నగర్‌లో ఉన్న ఆసియాలోనే అతిపెద్ద ఫర్నీచర్ మార్కెట్‌కు వెళ్లి కార్పెంటర్ సోదరులను కలిశాను. వారు కష్టించి పని చేసే వారే కాకుండా, చెక్కతో అందమైన, నాణ్యమైన ఫర్నీచర్ తయారు చేసే అద్భుతమైన కళాకారులు కూడా' అని రాహుల్ గాంధీ 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. వారి నుంచి కొన్ని నైపుణ్యాలు తెలుసుకోవడంతో పాటు నేర్చుకోవడానికి ప్రయత్నించానని అన్నారు. ఈ సందర్భంగా రాహుల్ కొన్ని ఫర్నీచర్ పరికరాలతో చెక్కడం కనిపించింది. అందుకు సంబంధించిన చిత్రాలను కూడా ఆయన తన పోస్ట్‌లో పంచుకున్నారు. 'భారత్ జోడో యాత్ర కొనసాగుతోంది' అని అని పేర్కొన్నారు.

ఎస్ఐ మెయిన్స్ పరీక్షలు
2 నెలలు వాయిదా వేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎస్ఐ మెయిన్స్ (తుది) పరీక్షలను 2 నెలలు వాయిదా వేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం వైఎస్ జగన్‌కు గురువారం ఆయన ఒక లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా పోలీస్ కానిస్టేబుళ్ల 6100, ఎస్ఐ-410 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ప్రకటన విడుదల చేసిందన్నారు. బోర్డు షెడ్యూల్ ప్రకారం మార్చిలో ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన ఎస్ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలను ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా వాయిదా వేశారని గుర్తుచేశారు. ఈనెల మొదటి తేదీ నుంచి విశాఖపట్నం, ఏలూరు, గుంటూరు, కర్నూలు రేంజ్‌లో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారని వివరించారు. అక్టోబర్ 14,15 తేదీల్లో మెయిన్స్ పరీక్షలకు కేవలం 20 రోజుల మాత్రమే సమయం ఉందన్నారు. సిలబస్ ఎక్కువగా ఉన్నందున అభ్యర్థులు సన్నద్ధమయ్యేందుకు కనీసం రెండు నెలలు అయినా గడువు పెంచాలని కోరారు.ఇప్పటికే ప్రిలిమ్స్ పరీక్షల్లో ముదు ప్రశ్నలు తప్పుగా ఉన్నాయని, కొంతమంది అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారని గుర్తు చేశారు. ఈ సమస్యలను గుర్తించి ఎస్ఐ మెయిన్ పరీక్షలను రెండు నెలల పాటు వాయిదా వేయాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

డీజీపీకి లేఖ: విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల పిలుపులో భాగంగా, కాకినాడలో ప్రశాంతంగా ధర్నా చేయడానికి వెళుతున్న సీపీఎం నాయకులపై అమానుషంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డికి శ్రీనివాసరావు ఒక లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించిన ఫోటోలను ఆ లేఖలో జత చేశారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరి మృతి

విశాలాంధ్ర-యుకొత్తపల్లి : కాకినాడ జిల్లా యు కొత్తపల్లి మండలం వాకతిప్ప గ్రామంలో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ఇద్దరు మృతి చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వాకతిప్ప ఉప సర్పంచ్ మామిడి మల్లిబాబు ఇంట్లో ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలడంతో సమీపంలో ఉన్న మల్లిబాబు మనవరాలు చేతిపువ్వు శ్రావణి (14) అక్కడికక్కడే మృతి చెందింది. చిన్న కుమారుడు మామిడి చిన్న(27)కు తీవ్ర గాయాలు కావడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా... చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే మల్లిబాబు కుమార్తె చేతి పువ్వు భవాని, తమ్ముడు కొడుకు అజయ్, లక్ష్మి గాయపడగా... కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మృతి చెందిన శ్రావణి... తాత మల్లిబాబు వద్ద ఉంటూ వాకతిప్ప ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. బుధవారం సెలవు కావడంతో ఇంటి వద్ద ఉండి తల్లికి వంటకు సహకరిస్తున్న సమయంలో గ్యాస్ సిలిండరు పేలి మృతి చెందినట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు. మల్లి బాబు కుమారుడు కాకినాడలో ఒక పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ శబ్దం రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ప్రమాదంలో పేలుడు ధాటికి దాబా ఇల్లు, ఇట్లో ఉన్న సామాగ్రి పూర్తిగా ధ్వంసమయ్యాయి. విషయం తెలుసుకున్న కాకినాడ జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, కొత్తపల్లి ఎస్సై స్వామి నాయుడు, అగ్నిమాపక సిబ్బంది, రెవిన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

సుప్రీంలో కేవియట్

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబు పాత్ర ఉన్నట్లు తమ వద్ద ఆధారాలున్నాయని, విద్యార్థులకు శిక్షణ ఇస్తామని కోట్ల కుంభకోణం చేశారని ప్రభుత్వం పేర్కొంది. నిధులను షెల్ కంపెనీల ద్వారా రూటు మళ్లించి సొమ్ము చేసుకున్నారని, కేంద్ర దర్యాప్తు సంస్థలు ఇప్పటికే ఈ అంశాన్ని గుర్తించాయని తెలిపింది. ఈ కేసులో మొదట సమాచారం ఇచ్చింది కేంద్ర పరిధిలోని జీఎస్టీ శాఖ అని, అందువల్ల ఈ కేసులో తమ వాదన కూడా వినాలని కోరుతూ కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది.

ఒకే ఘటన వాది, ప్రతివాది

(మొదటిపేజీ తరువాయి)

ఎంపి సునీల్ కుమార్ సింగ్ నేతృత్వంలోని సభాహక్కుల కమిటీకి స్పీకర్ ఈ ఫిర్యాదులన్నింటినీ పంపినట్లు ఆ వర్గాలు తెలిపాయి. కాగా ఈ విషయాన్ని కమిటీకి పంపినందుకు దూబే... స్పీకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. 'బీజేపీకి లోక్‌సభలో మెజారిటీ ఉన్నందున ఇది సాధ్యమైంది' అని ఆయన అన్నారు. గతంలో ఇటువంటి సంఘటనలపై దర్యాప్తు చేయడానికి ఎటువంటి కమిటీని ఏర్పాటు చేయలేదని, ఎవరినీ శిక్షించలేదని ఆయన పేర్కొన్నారు.

విద్వేష బిధూడీకి బీజేపీ నజరానా

న్యూఢిల్లీ: ద్వేశపూరిత ప్రసంగాల ద్వారా సమాజంలో అల్లర్లు, హింసను ప్రేరేపించే తమ నాయకులకు బీజేపీ నజరానాలు అందజేస్తోంది. అందుకు తాజా ఉదాహరణే...బీజేపీ ఎంపీ రమేశ్ బిధూడీకి రాజస్తాన్‌లోని టాంక్ జిల్లా ఎన్నికల బాధ్యతలు అప్పగించడం. ఇటీవల జరిగిన ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో బీఎస్పీ ఎంపీ దానిష్ అలీపై రమేశ్ బిధూఢీ అనుచిత వ్యాఖ్యలు చేశారు. అలీ మతాన్ని ప్రస్తావిస్తూ హేళనభావంతో మాట్లాడారు. ఆ మాటలకు పక్కనే కూర్చున్న కొంతమంది బీజేపీ ఎంపీలు సైతం వెకిలినవ్వులు నవ్వారు. బిధూడీ వ్యాఖ్యలపై విపక్షాలు సైతం ఆగ్రహం వెలిబుచ్చాయి. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. తనకు వ్యతిరేకంగా విద్వేష వ్యాఖ్యలు చేసిన రమేశ్ బిధూడీకి టాంక్ జిల్లా ఎన్నికల బాధ్యతలు అప్పగించడం...బీజేపీ ఆయనకు ఇచ్చిన అతిపెద్ద రివార్డు అని డానిష్ అలీ గురువారం ఆరోపించారు. ఇదే పాలక పార్టీ అసలైన లక్షణమని వ్యాఖ్యానించారు. రాజ్యాంగం, దిగువ సభ సంప్రదాయాలకు అనుగుణంగా బిధూడీపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా చర్యలు తీసుకుంటారని తాను భావించానని అలీ చెప్పారు. బిధూడీకి టాంక్ జిల్లా బాధ్యతలు అప్పగించడంపై అలీ స్పందిస్తూ 'బీజేపీ కొంత మేరకైనా మర్యాద పాటించాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలో మాదే అతిపెద్ద పార్టీ అని చెప్పుకుంటున్న బీజేపీ నుంచి దేశ ప్రజలు కొంత నైతికతను ఆశిస్తున్నారు. మీరు బిధూడీకి షోకాజు నోటీసు ఇచ్చారు. ఆయన సమాధానం బహిరంగ పర్చండి లేదా విద్వేషాన్ని చట్టబద్ధం చేస్తున్నట్లు చెప్పండి' అని అలీ పీటీఐతో మాట్లాడుతూ అన్నారు. 'విద్వేషాన్ని వ్యాప్తి చేయాల్సిందిగా మీ నాయకులకు నూరిపోస్తున్నారు.

ప్రజాస్వామ్యానికి దేవాలయం వంటి లోక్‌సభలో బిధూడీ ఆ పనిచేశారు. విద్వేషాన్ని వ్యాప్తి చేసినందుకు మీరు రివార్డు ఇచ్చారు. ఇదేగదా బీజేపీ అసలు రంగు. మొత్తంమీద మీ రంగును మీరే బయటపెట్టుకున్నారు' అని అలీ విమర్శించారు. ఇలాంటి నాయకులను పెంచిపోషించడం ద్వారా మెజారిటీ ప్రజల ఓట్లను రాబట్టుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. బిధూడీ వాడిన భాషను దేశ ప్రజలు ఎప్పటికీ అంగీకరించబోరని స్పష్టంచేశారు. ఇలాంటి ప్రవర్తనకు బీజేపీ మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. గుర్జార్ వర్గ ప్రజలు తనను కలిశారని, బిధూడీ వ్యాఖ్యలను అసహ్యించుకున్నారని, హిందువులు సైతం తన వద్దకు సంఘీభావం తెలిపారని చెప్పారు.

ఆందోళనతో నిలిచిన రైళ్లు

(మొదటిపేజీ తరువాయి)

హామీ, రైతులకు రుణమాఫీ వంటివి వారి డిమాండ్లలో ఉన్నాయి. స్వామినాథన్ కమిషన్ నివేదిక సిఫార్సుల మేరకు ఉత్తర భారత రాష్ట్రాలకు రూ.50 వేల కోట్ల వరద సహాయ ప్యాకేజీని, ఎంఎస్‌పీని రైతులు కోరుకుంటున్నారని రైతు నాయకుడు గుర్బచన్ సింగ్ అమృత్‌సర్‌లో అన్నారు. రైతులు, కూలీలకు సంబంధించిన మొత్తం రుణమాఫీ చేయాలని, ఇప్పుడు రద్దు చేసిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో చనిపోయిన ప్రతి రైతు కుటుంబానికి రూ.10 లక్షలు, నష్టపరిహారం కింద ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హోషియార్‌పూర్‌లో ఆజాద్ కిసాన్ కమిటీ సభ్యులు దోబా స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ధర్నా చేశారు. ఆజాద్ కిసాన్ కమిటీ దోబా రాష్ట్ర అధ్యక్షుడు హర్‌పాల్ సింగ్ సంఘా మాట్లాడుతూ ధరల హెచ్చుతగ్గుల నుంచి రైతులను కాపాడేందుకు ప్రభుత్వం ఎంఎస్‌పీపై తీసుకురావడం అత్యవసరమని అన్నారు. 2020-21 దిల్లీ సరిహద్దు నిరసన సందర్భంగా తమపై నమోదయిన అన్ని పోలీసు కేసులను రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఫిరోజ్‌పూర్‌లో రైతు నాయకుడు జస్బీర్ సింగ్ పిడ్డి మాట్లాడుతూ ఫిరోజ్‌పూర్ కాంట్ రైల్వే స్టేషన్, మల్లన్‌వాలా రైల్వే స్టేషన్‌లో రైల్వే ట్రాక్‌లను అడ్డుకున్నట్లు తెలిపారు.

విద్య, ఉపాధికి శత్రువు కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

చేసిందని ఆరోపించారు. సభలో ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు శుభం బెనర్జీ, జాతీయ ప్రధాన కార్యదర్శి విక్కీ మహేశ్వరి తదితరులు ప్రసంగించారు.

భారీ ర్యాలీ: మహాసభల ప్రారంభ సూచకంగా ఇక్కడి జీడీ కాలేజీ నుంచి సేవ్ ఎడ్యుకేషన్-సేవ్ నేషన్ పేరుతో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పటేల్‌చౌక్, కాళీస్థాన్, కచారీ జాతీయ రహదారి, అంబేద్కర్ చౌక్, బైపాస్, హర్‌హర్ మహదేవ్ చౌక్ గుండా తిరిగి జీడీ కాలేజీ మైదానానికి చేరుకుంది. అనంతరం అక్కడ భారీ బహిరంగ సభ జరిగింది. విద్య కాషాయీకరణ, నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తూ ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు దిక్కులు పిక్కటిల్లేలా చేసిన నినాదాలతో పురువీధులు మారుమోగాయి. విద్యార్థులు క్రమశిక్షణతో ప్రదర్శనలో పాల్గొన్నారు. బెగుసరాయ్ వీధులు శ్వేతారుణంగా మారాయి. 30వ జాతీయ మహాసభకు సూచకంగా 30 శ్వేతారుణ పతాకాలను చేబూని విద్యార్థులు నడువగా ఆ తరువాత రెడ్‌షర్ట్ వలంటీర్లు, విద్యార్థినులు, విద్యార్థులు నడిచారు. భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం అమలు చేయాలని, విద్య కాషాయీకరణ, కార్పొరేటీకరణను ఆపాలని, శాస్త్రీయ విద్యావిధానం అమలు చేయాలని, జాతీయ నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని, భగత్‌సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్పించాలని విద్యార్థులు నినదించారు. ప్రదర్శన అగ్రభాగాన ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి విక్కీ మహేశ్వరీ, ఎంపీ పి. సంతోశ్ కుమార్, ఎమ్మెల్యేలు రామ్‌రతన్ సింగ్, సూర్యకాంత్ పాశ్వాన్, మాజీ ఎమ్మెల్యేలు రాంనరేష్ పాండే, అవదేశ్ రాయ్, రాజేంద్ర సింగ్, మాజీ ఎమ్మెల్సీ సంజయ్ యాదవ్, రామకృష్ణ పాండా, ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆర్. తిరుమలై,విజేంద్ర కేసరీ, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి జి. రంగన్న, ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి తదితరులు నడిచారు. ప్రదర్శన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమీన్ హంజా, బెగుసరాయ్ జిల్లా అధ్యక్షులు అమ్రేష్ కుమార్ నేతృత్వంలో సాగింది.

జీపీఎస్‌పై మరో ఉద్యమం

(మొదటిపేజీ తరువాయి)

రోజుల్లోనే సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం తీసుకొస్తామని వైఎస్ జగన్ ప్రకటించిన విషయం విదితమే. అధికారంలోకి వచ్చాక జగన్ సర్కారు మౌనం దాల్చింది. సీపీఎస్ రద్దు చేయలేదు. పాత పెన్షన్ విధానం తీసుకురాకుండా జీపీఎస్ తెచ్చి విమర్శల పాలవుతోంది. జీపీఎస్‌ను మొదటి నుంచి ఉపాధ్యాయ, ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నప్పటికీ సర్కారు మొండివైఖరితో ముందుకు పోయింది. కొంతమంది ఉద్యోగ సంఘాల నేతలను ప్రభుత్వం గుప్పెట్లో పెట్టుకుని ఉద్యోగ, ఉపాధ్యాయులకు వ్యతిరేకంగా గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) బిల్లు తీసుకొచ్చినట్లు విమర్శలున్నాయి. ఈ బిల్లును ప్రతిపాదించినప్పటి నుంచి అసెంబ్లీలో పెట్టేంత వరకు ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. జీపీఎస్ బిల్లు ఆమోదాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ తిమ్మన్న, ఎల్.సాయి శ్రీనివాస్ అధ్వర్యంలో వివిధ ఉపాధ్యాయ సంఘాలు జీపీఎస్ బిల్లు ప్రతులు దహనం చేశాయి. కొవ్వొత్తులతో నిరసనలు తెలిపాయి. ప్రభుత్వంపై ఉద్యమానికి కలిసివచ్చే ఉద్యోగ సంఘాల నేతలతో సంప్రదింపులు జరుపుతున్నాయి. ఇప్పటికే ప్రధాన ఉపాధ్యాయ సంఘాలన్నీ జీపీఎస్‌ను వ్యతిరేకించాయి. మంత్రివర్గ ఉపసంఘం, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశానికి సైతం ఉపాధ్యాయ సంఘాలు హాజరు కాలేదు.

అక్కడెలా సాధ్యమైంది...

ఎలాంటి హామీ ఇవ్వకుండానే రాజస్తాన్, చత్తీస్‌గఢ్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, సిక్కిం తదితర రాష్ట్ర ప్రభుత్వాలు సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానం తీసుకొచ్చాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయుల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని ఈ కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో అధికారుల బృందాలు చర్చించి...పాత పెన్షన్ విధానంపై అధ్యయనం చేస్తాయని జగన్ సర్కారు ప్రకటించినప్పటికీ అలా జరగలేదు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీని పక్కనబెట్టి జీపీఎస్‌కు ఆమోదముద్ర వేసింది. సీపీఎస్‌కూ, జీపీఎస్‌కూ మధ్య పెద్ద తేడా లేదని ఉపాధ్యాయ సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ బిల్లుతో ఉద్యోగుల హక్కులు కాలరాయడమేనని వ్యాఖ్యానిస్తున్నాయి. రిటైర్డ్ ఉద్యోగుల హక్కుగా ఉన్న పాత పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం తెరమరుగు చేసి, జీపీఎస్ తీసుకురావడంతో ఉద్యోగులు ఎంతో నష్టానికి గురవుతారు. జీపీఎస్‌తో వారి పెన్షన్‌కు హామీ లేదు. జీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించేంతవరకు ఉద్యమిస్తామని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు ప్రకటించారు. రెండు, మూడు రోజుల్లో సహచర ఉద్యోగ సంఘాలతో చర్చించి కార్యాచరణకు సిద్ధమని ప్రకటించారు.

జగన్ హామీ దగా: ఎస్టీయూ

రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లకు పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ ప్రకటించారు. ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చారు. అధికారంలోకి వచ్చాక దగా చేశారని హెచ్.తిమ్మన్న, ఎల్.సాయిశ్రీనివాస్ విమర్శించారు. నాలుగున్నరేళ్లపాటు దీనిపై జాప్యం చేసి... దుర్మార్గమైన జీపీఎస్‌ను ముందుకు తీసుకొచ్చారని ఆగ్రహం వెలిబుచ్చారు. పక్క రాష్ట్రాల్లో పాత పెన్షన్ అమలైతే ఇక్కడ ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. జీపీఎస్ బిల్లును వెంటనే ఉపసంహరించాలని, లేకుంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం మొండిగా ముందుకెళ్తే రాబోయే ఎన్నికల్లో 13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లు, వారి కుటుంబాలు ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు.

జీపీఎస్ అప్రజాస్వామికం: కరిమి

జీపీఎస్ బిల్లును అసెంబ్లీ ఆమోదించడంపై ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు మండిపడ్డారు. జీపీఎస్ బిల్లు ప్రతులను అన్ని జిల్లాల్లో గురువారం దహనం చేసినట్లు తెలిపారు. 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని గెలిపించి పెద్ద తప్పు చేశామన్నారు. పాత పెన్షన్ ఇవ్వకపోగా, సీపీఎస్ కంటే అధికంగా నష్టం చేకూర్చే జీపీఎస్ బిల్లు ఆమోదించడం దారుణమన్నారు. ఉద్యోగులకు న్యాయబద్ధంగా ఇచ్చే పెన్షన్ ఆర్థిక భారమా అని ప్రశ్నించారు. ఏపీ జేఏసీలోని కొందరు నేతల వైఖరితోనే తమకు నష్టం వాటిల్లుతోందన్నారు.

మోదీ సర్కారు ఓటమికి ఐక్యపోరు

(మొదటిపేజీ తరువాయి)

రాజా...ఆర్‌జేడీ అధినేత లాలు ప్రసాద్ యాదవ్‌తో ఆయన నివాసంలో గురువారం సమావేశమయ్యారు. కేంద్రంలో పాలక బీజేపీపై పోరాడేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, ఎత్తుగడలపై లాలుతో రాజా చర్చించారు అనంతరం రాజా విలేకరులతో మాట్లాడుతూ మోదీ సర్కారును గద్దె దించాల్సిన ఆవశ్యకతను ఉద్ఘాటించారు. మోదీ సర్కారు తిరిగి అధికారం చేపడితే రాజ్యాంగానికే ప్రమాదం ఏర్పడుతుందని ఆయన హెచ్చరించారు. 'ఇండియా' కూటమి ఆవిర్భావంతో రానున్న ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయం బీజేపీని పట్టిపీడిస్తున్నదని రాజా చెప్పారు. ఎన్నికలు సమీపించే కొద్దీ మరిన్ని పార్టీలు ఇండియా కూటమిలో చేరతాయని స్పష్టంచేశారు. ఆ దిశగా చర్చలు జరుగుతున్నాయని, చాలా పార్టీలు తమ కూటమితో చేతులు కలపడానికి ఆసక్తి ప్రదర్శిస్తున్నాయన్నారు. ఇండియా కూటమిని మరింత బలోపేతం చేయడానికి కార్మికులు, రైతులు, మహిళలు, విద్యార్థులను ఏకతాటిపైకి తెచ్చేందుకు సీపీఐ కృషి చేస్తోందని రాజా వివరించారు.

ఎంఎస్ స్వామినాథన్ కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

ప్రతినిధి తెలిపారు. మరోవైపు, ఆయన అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో జరపనున్నట్లు తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా స్వామినాథన్ సేవలను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కొనియాడారు. భారతదేశం ఆహార భద్రత సాధించడంలో స్వామినాథన్ కృషి అనన్యసామాన్యమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్వామినాథన్ అంత్యక్రియలను అధికార లాంఛనాలతో జరపాలని సీఎం స్టాలిన్ ఆదేశించినట్లు అధికారిక ప్రకటన తెలిపింది.

స్వామినాథన్ అనేక అవార్డులు, రివార్డులు సాధించారు. 1971లో రామన్ మెగసెసే అవార్డు, 1986లో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ వరల్డ్ సైన్స్ అవార్డు అందుకున్నారు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, ఇందిరా శాంతి బహుమతి, ఇందిరా జాతీయ సమైక్యతా పురస్కారాలు పొందారు. ఇసుక నేలల్లోనూ పసిడి రాసులు పండించవచ్చని నిరూపించిన గొప్ప శాస్త్రవేత్త స్వామినాథన్. అధిక దిగుబడులిచ్చే కొత్త వంగడాల సృష్టికర్త. ప్రజలు పస్తులుండే దుస్థితి పోవాలని పరితపించిన హరిత విప్లవకారుడు. రైతులకు గిట్టుబాటు ధర మొదలు... వ్యవసాయంలో అధిక దిగుబడులు, మార్కెట్‌లో సంస్కరణలకు నిరంతరం కృషిచేసిన హరిత విప్లవ పితామహుడు. వ్యవసాయ స్వయంసమృద్ధికి నిరంతరం కృషి చేస్తూ దేశ వ్యవసాయ పద్ధతుల ముఖచిత్రాన్నే మార్చిన కర్షక పక్షపాతి స్వామినాథన్. కేవలం భారత్‌లోనే కాకుండా ప్రపంచ వ్యవసాయ రంగానికి డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ దశాదిశ చూపించారు.

స్వామినాథన్ 1961-72 కాలంలో ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ డైరెక్టరుగా, 1972-79 మధ్యకాలంలో ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చి డైరెక్టర్ జనరల్‌గా, వ్యవసాయ పరిశోధన-విద్యశాఖకు భారత ప్రభుత్వ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. స్వామినాథన్ స్థాపించిన ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చి ఫౌండేషన్ సేవలను ఐక్యరాజ్యసమితి సైతం గుర్తించింది. హరిత విప్లవ ఉద్యమ పితామహుడిగా పేర్కొంది. స్వామినాథన్ ప్రపంచంలోని అనేక యూనివర్సిటీల ద్వారా 84 గౌరవ డాక్టరేట్ డిగ్రీలు పొందారు. రాయల్ సొసైటీ ఆఫ్ లండన్, యూఎస్ నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సహా విద్యాసంస్థల నుంచి గౌరవం పొందారు. 2007-13 మధ్యకాలంలో ఆయన రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. కేంద్రప్రభుత్వంలోని అనేక శాఖల్లో ఆయన పదవులు నిర్వహించారు. 2010-13 మధ్యకాలంలో ఆహారభద్రతపై ప్రపంచ కమిటీకి సంబంధించి అత్యున్నతస్థాయి నిపుణుల కమిటీకి అధ్యక్షుడిగా పనిచేశారు.

కాగా, ఎంఎస్ స్వామినాథన్ మృతికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, ప్రధాని నరేంద్రమోదీ, కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గే, స్పీకర్ ఓంబిర్లా, కేంద్రమంత్రులు, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ, రైతు నాయకుడు రాకేశ్ తికైత్ ప్రభృతులు సంతాపం తెలిపారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

లోకేశ్ 'యువగళం' వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నందున యువగళం పాదయాత్ర పునఃప్రారంభ తేదీని వాయిదా వేసుకోవాలని లోకేశ్‌ని పార్టీ ముఖ్య నేతలు కోరారు. కక్ష సాధింపుతో అనేక కేసులు తెరపైకి తీసుకొచ్చి చంద్రబాబుని ప్రభుత్వం ఇబ్బంది పెడుతున్నందున దిల్లీలో న్యాయవాదులతో లోకేశ్ సంప్రదింపులు చేయాల్సిన అవసరముందని నేతలు అభిప్రాయపడ్డారు. పాదయాత్రలో ఉంటే న్యాయవాదులతో సంప్రదింపులు, ఇతర కార్యక్రమాల పర్యవేక్షణ కష్టమవుతుందని లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ నేతల అభిప్రాయాలతో ఏకీభవించిన లోకేశ్ తన యువగళం పాదయాత్ర పునఃప్రారంభ తేదీని వాయిదా వేసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. త్వరలోనే నాయకులతో చర్చించి యువగళం పునఃప్రారంభ తేదీని ప్రకటించనున్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత పోరాటం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: దేశ స్వాతంత్రం కోసం మూడు పదుల వయసులోనే ఉరికంబాన్ని సైతం ముద్దాడి ప్రాణాలర్పించిన యువ కిశోరం సర్దార్ భగత్ సింగ్, పోరాట స్ఫూర్తితో ప్రజా, యువజన సమస్యల మీద పోరాడాలనీ, భగత్ సింగ్ 116 వ జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు, రక్త దాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకుని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో మెగా రక్తదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ నేడు దేశంలో యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని, కార్పొరేట్ సంస్థలకు తొత్తులుగా మారి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను తాకట్టు పెడుతోందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి నేడు గాలికి వదిలేశారని విమర్శించారు. దేశంలో రాష్ట్రంలో నిరుద్యోగం తాండవం చేస్తున్నదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సంగతి చెప్పనక్కర్లేదని ప్రజలు, ప్రతి పక్ష పార్టీలు ఎటువంటి నిరసనలు ధర్నాలు చేయకూడదని జీఓలు తెచ్చి పోలీస్ వ్యవస్థను అడ్డం పెట్టుకొని ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో 'నేను ఉన్నాను-నేను విన్నాను', మాట తప్పను మడమ తిప్పను అంటూ ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేస్తానని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నేడు మాట తప్పి మడమతిప్పి రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న రెండు లక్షల 35 వేల పోస్టులు భర్తీ చేయకుండా నియంతలా వ్యవహరిస్తున్నాడని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఉన్న ఏకైక ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ప్రతి ఒక్క ఆంధ్ర పౌరుడు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రజా యువజన సమస్యలపై పోరాటాలే కాకుండా సేవా కార్యక్రమాలలో కూడా భగస్వామ్యం కావాలని నేటి యువతలో అమర వీరుల స్ఫూర్తి నింపే ప్రయత్నం చేయడం, అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు, నగర అధ్యక్ష కార్యదర్శులు కంచర్ల భార్గవ్, లంకా గోవిందరాజులు, నాయకులు శ్రీను, మోహన్, గాడి అజయ్, గుంజా క్రాంతి,రాము తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సమాఖ్య అధ్యక్షుడు యర్నేని నాగేంద్రనాథ్ మృతి

విశాలాంధ్ర-కలిదిండి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతాంగ సమాఖ్య అధ్యక్షుడు యర్నేని నాగేంద్రనాథ్ (చిట్టిబాబు-78) కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. మాజీ మంత్రి యర్నేని సీతాదేవి భర్త అయిన నాగేంద్ర నాథ్... కొద్దికాలంగా విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. నాగేంద్రనాథ్... తన స్వగ్రామం కొండూరులో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షు లుగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డ్రైనేజీ బోర్డు సభ్యులుగా పనిచేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతాంగ సమాఖ్య అధ్యక్షునిగా రైతాంగ సమస్యలపై పోరాడుతున్నారు. నీటిపారుదల కాలువలపై అవగాహన ఉన్న ఆయన తుదిశ్వాస వరకు రైతుల సమస్యలపై పోరాడారు. రైతాంగ సమస్యలపై లోతైన అధ్యయనంతో నిత్యం తన వాణిని వినిపించేవారు. పంటలకు కనీస మద్దతు ధరలు నిర్ణయించడంలో ప్రభుత్వాలు చేస్తున్న మోసాన్ని నిత్యం ప్రశ్నించేవారు. నిస్వార్థంగా అంకితభావంతో రైతాంగ ఉద్యమాలు నిర్వహించేవారు. సాగునీటి ప్రాజెక్టులు, పంటల మద్దతు ధరలు, వ్యవసాయానికి విద్యుత్ తదితర రైతాంగ సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించారు. రైతుల హక్కుల కోసం గట్టిగా పోరాడిన నాయకుడు. నాగేంద్రనాథ్ అంతిమయాత్ర శుక్రవారం కొండూరు గ్రామంలో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి టీడీపీ నాయకుడు పోకల జోగిరాజు, మాజీ సర్పంచి గొరిపర్తి నాగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, సర్పంచి బొర్రా వెంకటలక్ష్మి, సంతాపం తెలియజేశారు. అనేకమంది అభిమానులు, గ్రామస్తులు నాగేంద్రనాథ్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

మోదీ, అమిత్‌షా పగటి కలలు

ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శ

విశాలాంధ్ర-వినుకొండ: మతోన్మాదాన్ని అడ్డుపెట్టుకొని రానున్న ఎన్నికల్లో తిరిగి గద్దెనెక్కాలని ప్రధాని నరేంద్రమోదీ, అమిత్ షా కలలు కంటున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. వినుకొండ సీపీఐ కార్యాలయం శివయ్య భవన్‌లో గురువారం ముప్పాళ్ల విలేకరుల సమావేశంలో మాట్లా డారు. బాబ్రీ మసీదును తవ్వి నిజాలు తెలుసుకోవాలంటూ బీజేపీ ఎమ్మెల్యేలు కొత్త నాటకమాడుతున్నారని ముప్పాళ్ల అన్నారు. లౌకిక వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన చెప్పారు. రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలపై కేంద్రం తన వైఖరి తెలపాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీలో 25 ఎంపీ స్థానాలు గెలవాలని అమిత్‌షా పగటి కలలు కంటున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతిపక్షాల గొంతు నొక్కేస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షాలు రోడ్డుపైకి రాకుండా పోలీసులతో అడ్డుకుంటున్నారని, వైసీపీ మాత్రం ఎక్కడపడితే అక్కడ సభలు, సమావేశాలు జరుపుకుంటుందని, ఇది నియంత పాలనకు నిదర్శనమని ముప్పాళ్ల వ్యాఖ్యానించారు. అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావం దీక్ష విజయవాడలో తలపెట్టగా సంఘం నాయకులను, సీపీఐ నేతలను ఎక్కడికక్కడ గృహనిర్బంధం చేయటం ప్రభుత్వ కక్షసాధింపునకు తార్కాణమని ముప్పాళ్ల విమర్శించారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీని ఓడించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఇందుకు టీడీపీ, సీపీఐ, సీపీఎం, జనసేన కలిసి ముందుకు నడవాలని సూచించారు. శ్రీశైలం డ్యామ్, నాగార్జునసాగర్ డ్యామ్‌లో నీటి నిల్వలు తగ్గడంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారని ముప్పాళ్ల చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎగువ ప్రాంతాల నుండి నీరు రావడం లేదని, ప్రధాని మోదీని పెద్దతండ్రిగా భావించే జగన్‌మోహన్ రెడ్డి...నీటి సమస్యపై ఎందుకు మాట్లాడటం లేదని ముప్పాళ్ల ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తక్షణం జోక్యం చేసుకొని కేంద్రంతో మాట్లాడాలని, రాష్ట్రంలో ఉన్న డ్యాములకు నీరు వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు ఎం.సుబ్బారావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము, వైఎఫ్ మాజీ నాయకులు పి.లాల్ ఖాన్ పాల్గొన్నారు.

చేతివృత్తిదారులను మోసం చేస్తున్న పాలకులు

రామాంజనేయులు

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్రంలో విశ్వకర్మ యోజన పేరుతో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో జగనన్న చేయూత పేరుతో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చేతి వృత్తి దారులను మోసం చేస్తున్నాయని చేతివృత్తిదారుల సమాఖ్య ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు విమర్శించారు. విజయవాడ దాసరి భవన్‌లో సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు సి.లింగమయ్య అధ్యక్షతన గురువారం జరిగిన చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర సమితి సమావేశంలో రామాంజనేయులు మాట్లాడుతూ అధికారంలోకి రాక ముందు ఎన్నో మోసపూరిత వాగ్దానాలు చేసి చేతివృత్తిదారులను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ఎన్నికల ముందు తిరిగి మోసం చేసేందుకు నరేంద్ర మోదీ 18 రకాల చేతి వృత్తులను విశ్వకర్మ యోజన పథకం ద్వారా ఆదుకుంటామని ప్రకటించారని, రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి చేతివృత్తిదారులను ఊరించేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. చిత్తశుద్ధి ఉంటే చేతివృత్తిదారులు తీసుకున్న రుణాలన్నింటిని మాఫీ చేసి తిరిగి బ్యాంకుల ద్వారా స్వంత పూచికత్తుతో చేతి వృతులకనుగుణంగా సబ్సిడీ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేతి వృత్తుల జనాభాకు అనుగుణంగా ఉప ప్రణాళిక ద్వారా కనీస మౌలిక సౌకర్యాలు అందజేసి చేతివృత్తిదారులను ఆదుకోవాలని, వారిపై జరుగుతున్న దాడులను అరికట్టి సామాజిక జీవన భద్రతను కల్పించాలని డిమాండ్ చేశారు. వృత్తుల వారీగా వారు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలకు సమాయత్తం చేసేందుకు సమావేశంలో చర్చించినట్లు వివరించారు. అనంతరం నవంబరులో జరిగే గొర్రెల, మేకల పెంపకందార్ల రాష్ట్ర సదస్సును, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను, డిసెంబరు మొదటి వారంలో జరిగే చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను, చేతివృత్తిదారుల రాష్ట్ర శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని సమావేశం నిర్ణయించింది. తొలుత ప్రముఖ ప్రజా గాయకులు గద్దర్, వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్.స్వామినాథన్, చేనేత కార్మిక నాయకులు పోలా రామాంజనేయులు, సీపీఐ సీనియర్ సభ్యులు మామిడిపూడి రామారావు తదితరుల మృతికి సమావేశం సంతాపం తెలిపింది. ఈ సమావేశంలో మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పి.నాగాంజనేయులు, గొర్రెల, మేకల పెంపకం దార్ల సంఘం రాష్ట్ర కన్వీనర్ పోతులయ్య, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.వెంకట్రావు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కడుపు కన్నయ్య, గొట్టిముక్కల బాలాజీ, సమాఖ్య నాయకులు సి.వి.హరికృష్ణ, సి.నాగప్ప (అనంతపురం), ఎం.కారన్న, బి.మాధవ స్వామి, టి.రంగనాథ్ (కర్నూలు), కేవీ కృష్ణగౌడ్ (ప్రకాశం), పొట్లేలు పెంటయ్య (ఏలూరు), రాచాకుల శ్రీనివాస్ రావు (ఎన్‌టీఆర్ జిల్లా), సింహాద్రి దుర్గారావు (మన్యం పార్వతీపురం జిల్లా) తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్ మృతికి రామకృష్ణ సంతాపం

విశాలాంధ్ర-విజయవాడ : ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్. స్వామినాథన్ మరణం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రగాఢ సంతాపం తెలిపారు. స్వామినాథన్ మరణం బాధాకరమన్నారు. భారతదేశ ఆహార వృద్ధిలో, స్వయం సమృద్ధి సాధన కోసం స్వామినాథన్ ఎంతో కృషి చేశారన్నారు. ఆయన తన పరిశోధనలతో వరి వంగడాలు సృష్టించారన్నారు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, రామన్ మెగసెసె వంటి ఎన్నో పురస్కారాలు స్వామినాథన్‌కు మణిమకుటాలయ్యాయన్నారు. వ్యవసాయ రంగాభివృద్ధికి స్వామినాథన్ చేసిన కృషి విశేషమైనదని కొనియాడారు. స్వామినాథన్ మరణం పట్ల సీపీఐ రాష్ట్ర సమితి తరపున ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

యెర్నేని నాగేంద్రనాథ్ మరణం పట్ల సంతాపం

రైతాంగ సమాఖ్య అధ్యక్షులు యెర్నేని నాగేంద్రనాథ్ మరణం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రగాఢ సంతాపం తెలిపారు. రైతు సమస్యల పరిష్కారం కోసం నాగేంద్రనాథ్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. నాగేంద్రనాథ్ మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

గవర్నర్ సంతాపం

పద్మవిభూషణ్ ఎంఎస్ స్వామినాథన్ మృతికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రగాఢ సంతాపం, విచారం వ్యక్తం చేశారు. స్వామినాథన్ ప్రపంచ ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, మొక్కల జన్యు శాస్త్రవేత్త, నిర్వాహకుడు, మానవతావాది అని గవర్నరు పేర్కొన్నారు. భారతదేశ హరిత విప్లవ కార్యక్రమంలో తన పాత్రకుగాను ప్రపంచ నాయకుడిగా విస్తృతంగా ప్రసిద్ధి చెందారన్నారు. స్వామినాథన్ కుటుంబ సభ్యులకు గవర్నర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా, స్వామినాథన్ మృతి పట్ల పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు విచారం వ్యక్తం చేశారు. చెన్నైలోని ఎంఎస్ స్వామినాథన్ నివాసంలో ఆయన భౌతికకాయానికి వెంకయ్య నాయుడు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్వామినాథన్ మృతికి రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సంతాపం ప్రకటించారు.

ఏపీ రైతు సంఘం సంతాపం

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ మృతి పట్ల అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు రావుల వెంకయ్య, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామచంద్రయ్య, కేవీవీ ప్రసాద్, కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ. కాటమయ్య, పి. జమలయ్య గురువారం వేర్వేరు ప్రకటనల్లో సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. యూపీఏ ప్రభుత్వంలో వ్యవసాయానికి గిట్టుబాటు ధరల కోసం స్వామినాథన్‌తో కమిషన్ ఏర్పాటు చేశారని అన్నారు.

దేశ వ్యవసాయ రంగానికి తీరని లోటు : గిడుగు రుద్రరాజు

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్.స్వామినాథన్ మరణం దేశ వ్యవసాయ రంగానికి తీరని లోటు అని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేలైన గోధుమ, వరి వంగడాలను సృష్టించడంలో ఆయన కృషి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. వ్యవసాయ ఆధారిత భారతదేశంలో తన సేవల ద్వారా రైతులకు అండగా నిలిచి, మేలైన వంగడాలతో అత్యధిక దిగుబడులు సాధించడంలో గణనీయమైన పాత్ర పోషించారని వివరించారు. స్వామినాథన్ కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

స్వామినాథన్ మృతికి సీపీఎం సంతాపం

స్వామినాథన్ మృతి పట్ల సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సంతాపం తెలిపారు. స్వామినాథన్ హరిత విప్లవ వ్యవస్థాపకుడుగా పేరొందారన్నారు. వ్యవసాయ సంక్షోభానికి విరుగుడుగా ఆయన చేసిన సిఫార్సులు అత్యంత విలువైనవని, నేటికీ అనుసరణీయమైనవని వివరించారు. ఆయన చేసిన కృషికి దేశవిదేశాల్లో అనేక అవార్డులు పొందారన్నారు. స్వామినాథన్ మరణం దేశానికే తీరని లోటని పేర్కొంటూ, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

చెరుకూరి వీరయ్య మృతికి సంతాపం

నీటిపారుదల రంగ నిపుణులు చెరుకూరి వీరయ్య మృతి పట్ల అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు పి.రామచంద్రయ్య, కేవీవీ ప్రసాద్ ఒక ప్రకటనలో సంతాపాన్ని వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. చెరుకూరి వీరయ్య కృష్ణ, గోదావరి జలాల వినియోగం కోసం విశేష కృషి చేశారని, నీటిపారుదల కల్పనకు తన అనుభవాన్ని వెచ్చించారని కొనియాడారు.

వైసీపీ కేంద్ర కార్యాలయంలో

ఘనంగా గుర్రం జాషువా జయంతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మహాకవి గుర్రం జాషువా జయంతిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, ఎంపీ నందిగం సురేశ్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తదితరులు జాషు వా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జాషువా సమాజాన్ని మేల్కొలిపే విధంగా తన రచనలు చేశారన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున మాట్లా డుతూ... గుర్రం జాషువా జయంతిని అధికా రికంగా చేపట్టాలని నిర్ణ యించినందుకు సీఎం జగన్ కు ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. సమా జంలో అనేక అవమానాలు, వివక్షను ఎదుర్కొని ఎదిగిన మహాకవి జాషువా అని అన్నారు. జాషువా ఆశయాలు, స్ఫూర్తిని జగన్ ప్రభుత్వం ముందుకు తీసుకువెళుతోందని చెప్పారు. మున్సిపల్ మంత్రి ఆదిమూలపు సురేశ్ మాట్లాడుతూ సమాజంలో అసమానతలను తన కవిత్వం ద్వారా ఎత్తి చూపిన గొప్ప కవి జాషువా అన్నారు. ఆయన రచించిన గబ్బిలం, క్రీస్తు చరిత్ర, ఫిరదౌసి వంటి గొప్ప గ్రంథాలను అన్ని భాషల్లో అనువాదం చేయాల్సిన అవసరముందని అభిప్రాయ పడ్డారు. ఎంపీ నందిగం సురేశ్ మాట్లాడుతూ... అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పించేవిధంగా సమాజం ఉండాలని నిరంతరం తపించిన వ్యక్తి గుర్రం జాషువా అని కొనియాడారు. వివక్షతకు వ్యతిరేకంగా తనదైన శైలిలో సమాజాన్ని ఆయన మేల్కొలిపారన్నారు. లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ జాషువా చూపిన మార్గం అందరికి అనుసరణీయం అన్నారు. కులం, మతం, ప్రాంతం, పేద, ధనిక భేదం లేకుండా అందరికి సమాన ప్రాధాన్యత ఉండేలా సీఎం జగన్ పరిపాలన సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

సీఐడీ అధిపతి నియమోల్లంఘన

వైసీపీ నేతలా వ్యవహరిస్తూ చంద్రబాబు ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారు

కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు ఎంపీ రామ్మోహన్ నాయుడు ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ సీఐడీ చీఫ్ సంజయ్‌పై తెలుగుదేశం పార్టీ పార్లమెంటు సభ్యులు ఎంపీ రామ్మోహన్ నాయుడు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు గురువారం ఫిర్యాదు చేశారు. సర్వీస్ రూల్స్ పూర్తిగా అతిక్రమిస్తూ సంజయ్ ఏపీలో అధికార పార్టీగా ఉన్న వైసీపీకి తొత్తుగా పని చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆల్ ఇండియా సర్వీస్ రూల్స్ మేరకు రాజకీయ పక్షపాతాలు లేకుండా పనిచేయాల్సిన సీఐడీ చీఫ్ అన్నింటినీ ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ కార్యకర్త మాదిరిగా పనిచేస్తున్న ఐపీఎస్ అధికారి సంజయ్, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆనందం కోసం ప్రతిపక్షాలపై బురద చల్లుతున్నారని ఫిర్యాదులో ఎంపీ రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ప్రతిపక్ష నేత చంద్రబాబును అరెస్టు చేసి విచారణ చేయాల్సిన అధికారి, ఎటువంటి విచారణ జరపకుండానే, సర్వీసు నిబంధనలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రెస్ మీట్లు పెడుతూ ఆరోపణలు చేయడం తీవ్రమైన నేరమని తెలిపారు. దర్యాప్తు అంశాలు రూపొందించి కోర్టులకు నివేదించాల్సిన బాధ్యత కలిగిన ఐపీఎస్ అధికారి వైసీపీ నాయకుడులా ఢిల్లీ, హైదరాబాద్, అమరావతిలో వరుసగా ప్రెస్ మీట్లు పెడుతూ ప్రతిపక్ష నేతపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ఆరోపణలు చేస్తూ ఆయన ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని వివరించారు. అలాగే దర్యాప్తులో గోప్యంగా ఉంచాల్సిన అంశాలను మీడియాకు విడుదల చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐడీ చీఫ్ సంజయ్ ఉల్లంఘించిన సర్వీస్ రూల్స్, అతిక్రమించిన నిబంధనలు, అడ్డగోలు ప్రవర్తనపై అన్ని ఆధారాలను హోం మంత్రికి ఫిర్యాదుతో పాటు జత చేసి, ఆయనపై తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నలుపంటే భయమెందుకో సీఎం చెప్పాలి

అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు బాలకోటయ్య డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎరుపంటే భయపడే ముఖ్యమంత్రులు తెలుసు కానీ, నలుపంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఎందుకు భయమో తెలియటం లేదని అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు పోతుల బాలకోటయ్య గురువారం ఒక ప్రకటనలో సందేహం వ్యక్తం చేస్తూ, దీనిపై ముఖ్యమంత్రే సమాధానం చెప్పాలని కోరారు. విజయవాడలో శుక్రవారం నిర్వహించే సభకు డ్వాక్రా మహిళలందరూ కచ్చితంగా హాజరు కావాలంటూనే, సభకు వచ్చే మహిళలు నల్ల చీరలు, నల్ల జాకెట్లు ధరించరాదని, నల్ల రిబ్బన్లు, నల్ల చున్నీతో రాకూడదని ఆదేశించారని తెలిపారు. 'సీఎం సభకు మీరు రాకుంటే, మా ఉద్యోగాలు పోతాయి' అంటూ రిసోర్స్ పర్సన్స్ పై ఒత్తిడి చేస్తున్న విషయాలు పత్రికల్లో చూసి కంగారు పడ్డ అధికారులు ఆగమేఘాల మీద రిసోర్స్ పర్సన్లతో సమావేశాలు పెట్టి క్లాసులు పీకారని చెప్పారు. ఎవరూ వాట్సాప్ లలో మెసేజ్‌లు, వాయిస్ మెసేజ్‌లు పెట్టరాదని, స్వయంగా ఫోన్లు చేసి మహిళలను సమీకరణ చేయాలని, లేకుంటే ఉద్యోగాలు ఊడిపోతాయని అంటున్నారని పేర్కొన్నారు. నల్ల దుస్తులు, నల్ల వస్తువులు తీసుకుని వస్తే చర్యలు ఉంటాయని హెచ్చరికలు జారీ చేశారన్నారు. ఒక్కో మహిళకు సౌకర్యాలతో పాటు రూ.200 నుంచి రూ.300 డబ్బులు కూడా ఇస్తామని చెప్పినట్లుగా తెలిసిందన్నారు. సింహం సింగిల్‌గా వస్తోందంటున్న ముఖ్యమంత్రికి మహిళలు నల్ల దుస్తులు ధరిస్తే వచ్చిన ఇబ్బంది ఏమిటో మంత్రులైనా తెలియపరచాలని బాలకోటయ్య డిమాండ్ చేశారు.

1న రెవెన్యూ ఉద్యోగుల రాష్ట్ర కౌన్సిల్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో అక్టోబర్ 1వ తేదీ, ఆదివారం జరుగనున్న రెవెన్యూ ఉద్యోగుల 17వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ పిలుపు నిచ్చింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, చేబ్రోలు కృష్ణ మూర్తి గురువారం ప్రకటన విడుదల చేశారు. అసోసియేషన్ అధ్వర్యంలో మూడేళ్లకొకసారి సమావేశం జరగాల్సి ఉందన్నారు. వివిధ కారణాల రీత్యా దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత ఏపీ రెవెన్యూ అసోసియేషన్ 17వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశానికి అధిక సంఖ్యలో రెవెన్యూ ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ప్రత్యేక అతిథిగా ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయి ప్రసాద్ హాజరవుతారని తెలిపారు. ముందస్తుగా అనుకున్న ప్రకారం ఈ నెల 30 వ తేదీ శనివారం విజయవాడ గవర్నర్ పేటలోని రెవెన్యూ భవన్‌లో ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర కార్యవర్గానికి నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ తదితర ఎన్నికల ప్రక్రియ జరుగుతుందని తెలిపారు.

చంద్రబాబు కుంభకోణాలు ఎండగట్టాం

వైసీపీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు, ఆయన అనుచరులు చేసిన కుంభకోణాలను ప్రజలకు అర్థమయ్యేలా చర్చించామని వైసీపీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి చెప్పారు. చంద్రబాబు నిప్పు అయితే, టీడీపీ ఎమ్మెల్యేలు చర్చకు ఎందుకు రాలేదంటూ సూటిగా ప్రశ్నించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ సమావేశాల్లో టీడీపీ తీరు జుగుప్సాకరమని, చర్చిస్తే వాస్తవాలు బయట పడతాయనే సభ నుంచి పలాయనం చేశారన్నారు. స్కిల్ కుంభకోణంలో చంద్రబాబు అడ్డంగా దొరికారని విమర్శించారు. అన్ని కుంభకోణాలకు సూత్రధారులు, పాత్రధారులు తండ్రీ కొడుకులేనన్నారు. అధికారంలోకి రావాలి, అందినకాడికి దోచుకోవాలన్నదే టీడీపీ ఉద్దేశమని విమర్శించారు. తన భర్త క్రూరత్వాన్ని, స్వార్థ రాజకీయాలను భువనేశ్వరి గుర్తుకు తెచ్చుకోవాలని, వైసీపీ నేతలెవరూ ఆమెను అవమానించలేదని చెప్పారు. నిజానిజాలేంటో ఆమె చంద్రబాబునే నిలదీయాలన్నారు. ఐదేళ్ల టీడీపీ పరిపాలనలో ఎలాంటి అవినీతి జరిగిందనేది ప్రజలందరికీ తెలుసన్నారు. గ్రామీణ స్థాయిలో నీరు, చెట్టు పనుల దగ్గర నుంచీ పేదలకిచ్చే మరుగుదొడ్ల వరకు నిధుల దోపిడీ విధానం ఎలా జరిగిందనేదీ అందరికీ తెలిసిందేనని వివరించారు. వాటితో పాటు అమరావతి రాజధాని పేరిట ఆ తండ్రీకొడుకులు, నారాయణ వంటి టీడీపీ పెద్దలు చేసినటువంటి అవినీతి బాగోతం తవ్వేకొద్దీ బయటకొస్తోందని, వీటన్నింటినీ చూస్తే రాష్ట్ర ప్రజలే కాకుండా దేశం మొత్తం నివ్వెరబోయే పరిస్థితి ఉందన్నారు. ముఖ్యంగా యువతను అడ్డంపెట్టుకుని స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో రూ.371 కోట్లు షెల్ కంపెనీలకు విడుదల చేసిన చంద్రబాబు తిరిగి వాటిని తన ఖాతాలోకి ఎలా జమచేసుకున్నాడని అన్నారు. ఇందులో నిజాలను పూర్తిగా అందరికీ కళ్లకు కట్టినవిధంగా అసెంబ్లీ సమావేశాల్లో అర్థవంతమైన చర్చ జరిగిందని తెలిపారు.

టీడీపీ వైపు బైరెడ్డి చూపు!

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే, రాయలసీమ పరిరక్షణ సమితి నాయకులు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి టీడీపీలో చేరికకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. ఈ విషయమై ఇప్పటికే ఆయన టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మాట్లాడి నట్లు తెలిసింది. ఇంతలోనే చంద్రబాబు నంద్యాలలో అరెస్టు కావడంతో బైరెడ్డి చేరిక వాయిదా పడింది. బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అంటే రాయలసీమలో తెలియని వారుండరు. ఆయన సీమ సమస్యలపై నిత్యం ప్రభుత్వంపై పోరాటం చేస్తుంటారు. నందికొట్కూరు శాసనసభ్యునిగా టీడీపీ నుంచే మూడుసార్లు విజయం సాధించారు. అంతకు ముందు ఆయన తండ్రి బైరెడ్డి శేషశయనారెడ్డి కూడా నందికొట్కూరు ఎమ్మెల్యేగా, మంత్రిగా కూడా పనిచేశారు. బైరెడ్డి... 2019 ఎన్నికల తరువాత బీజేపీలో చేరారు. 2009 డీలిమిటేషన్ వరకు ఆయన నందికొట్కూరు ఎమ్మెల్యేగా పోటీ చేస్తూ విజయం సాధించారు. డీలిమిటేషన్ తరువాత నందికొట్కూరు నియోజకవర్గం ఎస్సీలకు కేటాయించడంతో ఆయన కొత్తగా ఏర్పడిన పాణ్యం నియోజకవర్గంపై దృష్టి సారించారు. 2009లో బైరెడ్డి పాణ్యం నుండి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2014 తరువాత రాయలసీమ పరిరక్షణ సమితి ఏర్పాటు చేసి రాయలసీమ హక్కుల కోసం, సీమ ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై గళమెత్తారు. రాయలసీమలోని పూర్వపు నాలుగు జిల్లాల్లో ట్రాక్టర్ యాత్ర చేశారు. బైరెడ్డి సీమకు రావలసిన నీటి వాటాపై న్యాయపోరాటం చేయడమే కాకుండా... తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలు అక్రమంగా నిర్మిస్తున్న ప్రాజెక్టులపై ఆందోళనలు చేస్తూ... సీమకు జరుగుతున్న అన్యాయంపై ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యం చేస్తుంటారు. బైరెడ్డి చేరితే నంద్యాల జిల్లాలో టీడీపీ బలోపేతం అవుతుందనడంలో సందేహం లేదు. బైరెడ్డి నంద్యాల ఎంపీ లేదా పాణ్యం ఎమ్మెల్యే సీటు అడిగే అవకాశం లేకపోలేదు. అయితే ఇప్పటికే గౌరు కుటుంబం పాణ్యం సీటుపై దృష్టి సారించడమే కాకుండా 2019 ఎన్నికలలో పోటీ చేసింది. గౌరు వెంకటరెడ్డి టీడీపీ నంద్యాలపార్లమెంట్ అధ్యక్షునిగా కూడా పనిచేశారు. గౌరు కుటుంబాన్ని కాదని బైరెడ్డికి పాణ్యం సీటు ఇస్తారా అనేది అనుమానమే. అయితే నంద్యాల ఎంపీ సీటు గత ఎన్నికలలో మాండ్రా శివానందరెడ్డికి కి కేటాయించాగా అయన ఓటమి పాలయ్యారు. టీడీపీలో ఈసారి నంద్యాల ఎంపీ సీటు ఎవరికి ఇస్తారనేది ఇంత వరకు స్పష్టత లేదు. బైరెడ్డి చేరితే నంద్యాల పార్లమెంట్ సీటు ఆయనకు ఇచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. నందికొట్కూరు, పాణ్యం, శ్రీశైలంతోపాటు బనగానపల్లె నియోజకవర్గంలో బలమైన అనుచర వర్గం ఉండటంతో బైరెడ్డికి కేటాయిస్తే విజయం తథ్యమని అనుకుంటున్నారు. చంద్రబాబు విడుదలయ్యాక బైరెడ్డితోపాటు ఆయన అనుచరులు బారీ స్థాయిలో టీడీపీలో చేరనున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే నంద్యాల జిల్లాలో టీడీపీకి కొ త్త ఉత్సాహం వస్తుందని టీడీపీ శ్రేణులు భావిస్తున్నాయి.

సంపాదకీయం

అవధి మీరిన అసత్య ప్రచారం

సచేతన గుజరాత్ (వైబ్రెంట్ గుజరాత్) సమావేశాలు గత ఇరవై ఏళ్లుగా నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయి. అలాంటిదే బుధవారం ఏర్పాటు అయింది. ప్రధాన మోదీ దానికి హాజరయ్యారు. గుజరాత్ నమూనా గురించి ముఖ్యంగా సచేతన గుజరాత్ గురించి గొప్పలు చెప్పుకున్నారు. 2003లో మొదటిసారి సచేతన గుజరాత్ ఉత్సవాలు జరిగినప్పుడు అందులో ప్రస్తుతం వివాదాస్పద పారిశ్రామికవేత్తగా మారిన గౌతం అదానీ ప్రముఖంగా కనిపించారు. కానీ ఈసారి మాత్రం అదానీ హాజరు కాలేదు కానీ ఆయన కుమారుడు కనిపించారు. 2003 కన్నా ముందు గుజరాత్ 2002లో మారణకాండ సృష్టించిన విధ్వంసం దేశాన్నే కాదు, ప్రపంచాన్నే కుదిపేసింది. మోదీ అమెరికాలో పర్యటించాలనుకున్నప్పుడు ఆ దేశం ఆయనకు వీసా ఇవ్వడానికీ నిరాకరించింది. ఆయన ప్రధానమంత్రి అయిన తరవాత ఆ పరిస్థితి సహజంగానే మారిపోయింది. గోద్రా సంఘటనను ఈ సమావేశంలో మరిచిపోకుండా ప్రస్తావించిన మోదీ 2002 నాటి మారణకాండ ఊసేఎత్తలేదు. అహ్మదాబాద్‌లో జరిగిన ఉత్సవాలలో మాట్లాడుతూ మోదీ సహజధోరణిలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ మీద అవధులులేని నిందలు మోపారు. అప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న యు.పి.ఎ. ప్రభుత్వం గుజరాత్ అభివృద్ధికి సహకరించకపోగా విదేశీ పెట్టుబడులు సమకూరకుండా అడ్డు తగిలిందని ఆరోపించారు. సచేతన గుజరాత్ సమావేశాలకు అప్పటి కేంద్రమంత్రులు హాజరయ్యేవారు కాదని, గుజరాత్‌లో పెట్టుబడులు పెట్టకూడదని విదేశీ మదుపుదార్లను హెచ్చరించేవారు అని నిరాధారమైన వాదనకు దిగారు. అయినా తాను ముఖ్యమంత్రి అయిన తరవాత సుపరిపాలన అందించినందువల్ల, అభివృద్ధికి దోహదంచేసే విధానాలు అమలు చేసినందువల్ల గుజరాత్‌కు దండిగా పెట్టుబడులు సమకూరాయని చెప్పుకున్నారు. గుజరాత్ అభివృద్ధి దేశాభివృద్ధికి దారితీస్తుందని కూడా అన్నారు. గుజరాత్ ఎప్పుడూ వ్యాపారుల రాజ్యంగా ప్రసిద్ధి చెందిందని, అయితే 21వ శతాబ్దం గుజరాత్‌ను వ్యవసాయకంగా, ఆర్థికంగా, పారిశ్రామికంగా, వస్తూత్పత్తిపరంగా అగ్రస్థానంలో నిలబెట్టానని మోదీ తన వీపు తానే చరుచుకున్నారు. కేశూభాయ్ పటేల్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో భూకంపం గుజరాత్‌ను చిందరవందర చేసింది. పరిస్థితిని ఎదుర్కోవడంలో కేశూభాయ్ విఫలమయ్యారన్న అభిప్రాయంతోనే అప్పటికి ఎప్పుడూ ఎన్నికలలో పోటీచేయని మోదీని అప్పటి అగ్రనాయకులు వాజపేయి, అద్వాణీ ద్వయం మోదీని గుజరాత్ ముఖ్యమంత్రి స్థానంలో కూర్చోబెట్టారు. 133 సహకారబ్యాంకులు దివాలా తీసిన వాస్తవాన్నీ మోదీ ప్రస్తావించారు. యువకులు, వ్యాపారస్థులు, పారిశ్రామికవేత్తలు గుజరాత్ వదిలి వెళ్తారని ప్రచారం చేశారనీ గుజరాత్‌ను అపఖ్యాతిపాలు చేయడానికి పెద్ద కుట్ర జరిగిందని వాపోయారు. కానీ ఎట్టి పరిస్థితిలోనూ గుజరాత్‌ను ఈ క్లిష్ట పరిస్థితినుంచి బయటికి లాగాలన్న దృఢ సంకల్పంతో పనిచేశాననీ ప్రకటించారు. సచేతన గుజరాత్ తో దీనికి శ్రీకారం చుట్టారట. 2003లో సచేతన గుజరాత్ కార్యక్రమం ప్రారంభించినప్పుడు కేవలం వందమందే పాల్గొన్నారని, ఇప్పుడు 40 వేల మంది హాజరవుతున్నారని కూడా తెలియజేశారు. సచేతన గుజరాత్ కార్యక్రమం ఇతర రాష్ట్రాలను కూడా పెట్టుబడులు, ప్రధానంగా విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రేరేపించిన మాట వాస్తవం. కానీ ఇలాంటి ప్రయత్నాలలో వాగ్దానాలు ఎక్కువ. వాస్తవంగా సమకూరే పెట్టుబడులు అత్యల్పం. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి పరిస్థితీ దీనికి భిన్నమైందికాదు. కేంద్రంలో ఎన్.డి.ఎ. అధికారంలో ఉన్నప్పుడే మోదీ సచేతన గుజరాత్ పథకం ప్రారంభించారు. ఆ తరవాత ఏడాదికి కేంద్రంలో యు.పి.ఎ. ప్రభుత్వం ఏర్పడింది. కొన్ని అంశాల్లో గుజరాత్ మిగతా రాష్ట్రాలకన్నా అగ్రభాగాన ఉన్న మాట నిజమే. కొన్ని వాస్తవాలు, కేంద్ర ప్రభుత్వ గణాంకాలు పరిశీలిస్తే మోదీ వాదనలోని బూటకం బయట పడుతుంది. ఉదాహరణకు 2004 నుంచి 2014వరకు అంటే యు.పి.ఎ. కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడే గుజరాత్‌కు మొత్తం 285 అవార్డులు వచ్చాయి. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చినవే. ఇందులో ఏడు ప్రధానమంత్రి అవార్డులు. అప్పుడు ప్రధానిగా ఉన్నది యు.పి.ఎ. ప్రభుత్వానికి నాయకత్వం వహించిన మన్మోహన్ సింగ్. వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాల నుంచి 82 అవార్డులు దక్కాయి. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు 172 అవార్డులు ఇచ్చాయి. యు.పి.ఎ. గుజరాత్‌కు పెట్టుబడులు అందకుండా అడ్డుతగిలి ఉంటే ఈ అవార్డులన్నీ ఎక్కడినుంచి వచ్చేవి అన్న ప్రశ్నకు మాత్రం మోదీ దగ్గర సమాధానం ఉండదు. యు.పి.ఎ. ప్రభుత్వం రాజకీయ కారణాలవల్ల గుజరాత్ అభివృద్ధికి అడ్డు తగలాలనుకుంటే పెట్టుబడులు అందకుండా చేయగలిగేది. కానీ అలా ఎప్పుడూ చేయలేదు. 1991లో సరళీకృత ఆర్థిక విధానాలు అమలులోకి వచ్చిన తరవాతే రాష్ట్రాలు సొంతంగా పెట్టుబడులు, ముఖ్యంగా విదేశీ పెట్టుబడులు సమకూర్చుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేయగలిగాయి. ఇది విధానాల్లో వచ్చిన మార్పు ఫలితమే తప్ప మోదీ ప్రతిభకాదు. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రి కాకముందే గుజరాత్ అభివృద్ధి చెందిన రాష్ట్రం. పారిశ్రామికంగా తమిళనాడు ప్రథమస్థానంలో ఉంటే గుజరాత్ రెండవ స్థానంలోనో, మూడవ స్థానంలోనో ఉంటూ వస్తోంది. ఇదంతా మోదీ రంగం మీదకు రానప్పటి కథే. పెట్టుబడులకోసం వివిధ రాష్ట్రాలు కృషిచేసినప్పుడు ప్రతిపాదనలు వేలసంఖ్యలో వస్తాయి. లక్షలకోట్ల రూపాయల పెట్టుబడి సమకూరుతుందన్న ఆశ కలుగుతుంది. కానీ ఏ రాష్ట్రంలోనూ ప్రతిపాదనల్లో అమలయ్యేది చాలా తక్కువ. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడూ ఈ పరిస్థితి మారలేదు. పారిశ్రామికంగా అగ్రస్థానంలో ఉన్న తమిళనాడులో గత అర్ధ శతాబ్దంగా కాంగ్రెస్ ఒక్కసారి కూడా అధికారంలోలేదు. పక్షపాతం చూపితే తమిళనాడు అగ్రస్థానం ఆక్రమించగలిగేదా? ఈ ప్రశ్నకూ మోదీ దగ్గర సమాధానం ఉండదు. డబుల్ ఇంజన్ సర్కారువల్ల ఎంత మహత్తర ప్రయోజనం ఉంటుందో మోదీ నిర్విరామంగా ప్రచారం చేస్తుంటారు. రెండు దశాబ్దాలకు పైనుంచి గుజరాత్‌లో అధికారంలో ఉన్నది బీజేపీ ప్రభుత్వమే. పదేళ్లనుంచి డబుల్ ఇంజన్ సర్కారే కొనసాగుతోంది. అలాంటప్పుడు గుజరాత్ పారిశ్రామికంగా మొదటిస్థానం సాధించి ఉండొచ్చుగా! సంపన్నమైన గుజరాత్‌ను మోదీ మరింత సుసంపన్నం చేశారు అని సాక్షాత్తు అద్వాణీయే చెప్పారు. మంచి అంతా తన పంచల్లోనే పడిగాపులు పడుతోందన్న అసత్యాన్ని గట్టిగా ప్రచారం చేయడంలో మోదీని మించిన వారులేరు. మహారాష్ట్రకు దక్కవలసిన సెమి కండక్టర్లు, టాటా పరిశ్రమలను మోదీ గుజరాత్‌కు తరలించుకు వెళ్లారు. వాటికి ఇప్పటికీ పునాదిరాయి కూడా పడలేదు. అనేక అంశాలలో గుజరాత్ బలహీనమైన రాష్ట్రాలకన్నా వెనుకబడిఉందని కేంద్ర ప్రభుత్వ గణాంకాలను, మానవాభివృద్ధి సూచికలను పరిశీలించినా తెలుస్తుంది. వాస్తవాలతో పనిలేకపోవడమే మోదీ నైజం. ఏ భయంవల్ల అదానీని సచేతన గుజరాత్ ఉత్సవాలలో మోదీ పక్కన కూర్చోబెట్టుకోలేదో దాచినా దాగని సత్యం.

ఆకలి నుంచి రక్షించిన హరిత విప్లవ పితామహుడు

డా.సోమ మర్ల

గత శతాబ్దపు ఏభై, అరవై దశాబ్దాలల్లో దేశంలో తిండిగింజల కొరత తీవ్రంగా ఉండేది. దేశంలో గోధుమ, వరి ఉత్పత్తి అంతంత మాత్రం. అమెరికా_ లా-480 ఒడంబడిక ద్వారా మద్రాసు, కలకత్తా, బొంబాయి రేవులకు ఓడలు ఎప్పుడు వస్తాయో, రేషను, కిరాణా దుకాణాల్లో బియ్యం, గోధుమలకై ప్రజలు ఎదురుచూసిన రోజులవి. అలాంటి దయనీయ పరిస్థితుల నుండి గట్టెక్కి ఆహారధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించి నేడు విదేశాలకుసైతం ఎగుమతి (స్వాతంత్ర్యానంతరం అరకోటి టన్నుల ఉత్పత్తి నుండి నేడు ముప్పయి మూడు కోట్ల టన్నులకు) చేరగలదనుకున్నామంటే మనం ముఖ్యంగా హరిత విప్లవ పితామహుడు డా.స్వామినాథన్ కృషికి రుణపడి ఉన్నాము.

మనుకోంబు సాంబశివన్ స్వామినాథన్ ఆగస్టు 7వ తేదీ, 1925 న కుంభకోణం అప్పటి మద్రాసు రాష్ట్రంలో జన్మించాడు. కోయంబత్తూరు వ్యవసాయ కళాశాల నుండి వ్యవసాయ పట్టభద్రుడై భారత్ వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐఏఆర్ఐ) దిల్లీ నుండి ఎమ్ఎస్సి డిగ్రీపొంది నెదర్లాండ్స్, ఇంగ్లాండులో ఉన్నత విద్య నభ్యసించారు. విదేశాల్లో ఎన్నో ఉచిత అవకాశాలువచ్చినా త్యజించి భారతదేశానికి తిరిగివచ్చారు. గత శతాబ్దపు నలభయ్యవ దశకంలో సంభవించిన 'బెంగాలు కరువు' స్వామినాథన్‌ను భారత వ్యవసాయ పరిశోధనల్లో కృషికి పురికొల్పాయి.

భారత పరిశోధనా మండలి (ఐసీఐఆర్)లో దీర్ఘకాలం వ్యవసాయ పరిశోధనలు చేశారు. అరవయ్యో దశకంలో అమెరికాకు చెందిన సుప్రసిద్ధ గోధుమ శాస్త్రవేత్త నుండి అధిక దిగుమతినిచ్చే పొట్టి గోధుమ వంగడాలను తెచ్చి దిల్లీ, లూధియానా వ్యవసాయ క్షేత్రాల్లో పరిశోధించి, మన దేశ నేలలు, వాతావరణానికి సరిపడేలా మార్పులు చేసి ప్రథమంగా 'కళ్యాణసోన" వంటి అధిక దిగుబడి వంగడాలను ప్రవేశపెట్టారు. అదే విధంగా తైవాన్ నుండి "టిఎన్-1" తదితర పొట్టి వరి వంగడాలను తెచ్చి వాటిలో 'డయాఊజెన్" అనే అధిక దిగుబడికి కారణమైన జన్యువును ప్రవేశపెట్టి 'ఐ.ఆర్.10', 'జయ' వంటి సన్నగింజ వరి రకాలను దక్షిణ భారతదేశంలో ప్రథమంగా ప్రవేశపెట్టారు. నూతన అధిక దిగుబడి వరి, గోధుమ వంగడాల ప్రవేశంతో డెబ్బయవ దశకం మధ్యకల్లా దేశంలో ఆహారోత్పత్తి పెరిగి దేశం స్వయంసమృద్ధిని సాధించగలిగింది. నేడు దాదాపు ఆరు బిలియన్ డాలర్ల విదేశీద్రవ్యాన్ని ఎగుమతుల ద్వారా సాధిస్తున్నాము. అధిక దిగుబడినిచ్చే ప్రథమ బాసుమతి వంగడాన్ని రూపొందించిన శాస్త్రవేత్త డా.స్వామినాథన్. అదేవిధంగా వేరు పురుగుల్ని తట్టుకునే బంగాళాదుంప రకాలనూ రూపొందించటంలో అపార కృషిచేసి భారత్, నెదర్లాండ్స్, ఇంగ్లాండ్ తదితర దేశాల్లో బంగళాదుంప ఉత్పత్తి ఇతోధికంగా పెరగడానికి ఈయన పరిశోధన, కృషి తోడ్పడింది.

భారత వ్యవసాయపరిశోధనా సంస్థ (ఐసిఎఆర్)కు డైరెక్టరుగా, ఫిలిప్పీన్స్‌లోని అంతర్జాతీయ పరిశోధనా సంస్థకు డైరెక్టరుగా, హైద్రాబాద్‌లో ఇక్రిసాట్ సంస్థ ప్రారంభించడంలో డా.స్వామినాథన్ కృషి అపారం. ఈయన సేవలకు గుర్తింపుగా ప్రపంచ ఆహార అవార్డు, భారత ప్రభుత్వం పద్మవిభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ అవార్డులు పొందారు.

పదవీ విరమణ అనంతరం మద్రాసు నగరంలో "స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్"ను స్థాపించి మహిళా రైతుల అభ్యున్నతికి, జీవ వైవిధ్య పెంపునకు ఎంతో కృషి చేశారు. ముఖ్యంగా సముద్రతీరంలో సునామీ వంటి అవాంతరాల నుండి రక్షించే 'మడ అడవుల" పెంపుదలకు దక్షిణ కోస్తా ప్రాంతాలలో చేపట్టిన అపారకృషి చెప్పుకోదగినది.

ఈయన కృషికి గుర్తింపుగా 1997 నుండి 2012 వరకు అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం డా.స్వామినాథన్‌ను రాజ్యసభ సభ్యునిగా నియమించారు. ఆ సమయంలోనే కర్షకుల హక్కులపై ఎన్నో ముఖ్యమైన అంశాలను రాజ్యసభలో ప్రస్తావించేవారు. ఆయన ప్రవేశపెట్టిన 'మహిళా రైతుకు సమాన ఆస్తిహక్కు" తీర్మానం ఆమోదించకపోవటం విచారకరం.

రైతు కమిషను:

వ్యవసాయ సంక్షోభం, ముఖ్యంగా పెరుగుతున్న రైతు ఆత్మహత్యల నేపధ్యంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం పరిష్కారాలు చూపమని డా.స్వామినాథన్ అధ్యక్షతన వ్యవసాయ కమిషన్‌ను ఏర్పరిచింది. ఈ కమిషన్‌లో అఖిలభారత రైతుసంఘ కార్యకర్త అతుల్ కుమార్ అంజాన్ కూడా సభ్యులు. ఈ కమిషను కూడా వ్యవసాయ రంగాన్ని కూలంకషంగా పరిశీలించి పరిష్కారాలతో కూడిన అనేక సిఫార్సులను ప్రభుత్వానికి సమర్పించింది. పంటలు ముఖ్యమైనవి, పంటలకు మద్దతు ధరలను శాస్త్రీయంగా లెక్కించటం, పంటల గ్యారంటీ కొనుగోళ్లు, తక్షణమే భూ సంస్కరణల అమలు, పర్యావరణ రక్షణకు తోడ్పడే వ్యవసాయవిధానం, మహిళా రైతులకు సమాన ఆస్తి హక్కులు వగైరా ప్రధానమైనవి.

దేశంలో ఆహార ధాన్యాల అధికోత్పత్తికి తోడ్పడి, ఆకలినుండి ప్రజలను రక్షించిన శాస్త్రవేత్త డా.స్వామినాథన్ మరణంతో దేశప్రజలు, ముఖ్యంగా రైతుసోదరులు తమ వాణిని వినిపించే వ్యవసాయ పితామహుణ్ణి కోల్పోయారు.

ప్రిన్సిపల్ సైంటిస్ట్ (జీనోమిక్స్ రిటైర్డు)
భారత వ్యవసాయపరిశోధన సంస్థ
న్యూదిల్లీ

మానవుడు-స్వేచ్ఛ

మనిషి ప్రాథమికంగ స్వేచ్ఛ కోరుకుంటాడు. జంతువులకు ఆలోచించే శక్తిలేదు. అందుకు ముందు నడుస్తున్న జంతువును మిగతావి అనుసరిస్తాయి. కాని మనిషి అందుకు భిన్నం. అటువైపే ఎందుకెళ్లాలి. ఇంకోమార్గాన ఎందుకు వెళ్లకూడదన్న ఆలోచన వస్తుంది. ఆ ఆలోచనల ఫలితంగా ప్రతి విషయాన్ని నిశితంగా పరిశీలించి ప్రశ్నిస్తాడు. అందుకే ప్రముఖ నవలా రచయిత త్రిపురనేని గోపిచంద్ ఏమిటి? ఎందుకు? అన్న ప్రశ్న నేర్పినందుకు తన నవల తండ్రి రామస్వామికి అంకితమిస్తాడు. అంటే మనిషికి ప్రాథమికంగా ప్రశ్నించే స్వేచ్ఛ అవసరం అలా ప్రశ్నించకుండా గుడ్డిగా ఒకరిని అనుసరిస్తే జంతువులతో సమానమే అంటారు మేధావులు. మనుషుల సముదాయమే సమాజం. ఆ సమాజంలో మనిషికి స్వేచ్ఛ అవసరం. ఆ స్వేచ్ఛ ఉండబట్టి సమాజంలో అనేక సంఘాలు, అనేక రాజకీయ పార్టీలు ఏర్పడి పనిచేస్తున్నాయి. కాని మనిషి కోరుకుని ఏర్పాటు చేసుకున్న సంఘాలలో అనుకోకుండా స్వేచ్ఛ కోల్పోతున్నాడు. ప్రాథమిక సభ్యత్వం తీసుకున్నప్పుడు ఉన్న స్వేచ్ఛ తరువాత కోల్పోతున్నాడు. ఏంటి బావ నన్ను పలకరించకుండానే నిలబెట్టి ఉపన్యాసం దంచుతున్నావు, రావయ్యా మీ చెల్లి ఇచ్చిన కాఫీ తాగుతున్నావుగా అని మాట్లాడుతున్నా. నువ్వు వస్తూనే ఒకే జాతి, ఒకే దేశం అంటూ వచ్చావుగ. ఇప్పుడు ఒకటికాక రెండు, మూడు దేశాలున్న మన దేశంలో కొత్తగా ఒకే దేశం అనే స్లోగన్ మోదీ ఎందుకందుకున్నాడు. అవును ఆ తరువాత ఒకే దేశం, ఒకే పార్టీ అంటాడు. పార్టీలో అంతర్గత స్వేచ్ఛ ఇప్పటికే అంతరించిపోయింది. నిజమే బావ ఆ తరువాత అధినాయకుడు చెప్పిందే అందరూ అనుసరించాలంటాడు. చివరకు అది నియంతృత్వానికి దారి తీస్తుంది. ఇప్పటికే అధికారంలోఉన్న అధినాయకుడు కోర్టులను కూడా తనుచెప్పినట్లు వినేటట్లు చేసుకుని వ్యవస్థలను మానేజ్ చేస్తున్న సంఘటనలు చూస్తున్నాం. నిజమే దీన్నిబట్టి అలోచిస్తే మనిషి తాను

ఏర్పాటు చేసుకున్న సంఘాలలో గాని, రాజకీయ పార్టీలలో గాని తనకు తెలియకుండానే నిమిత్తమాత్రుడుగ మారి తానుకోరుకున్న స్వేచ్ఛ కోల్పోతున్నాడు. నిజమే 135కోట్ల ప్రజలు ఎన్నుకున్న ప్రధాని చెప్పిందే వినాల్సిన పరిస్థితి ఇప్పుడు ఒకే జాతి ఒకే ఎన్నిక, ఒకే దేశంలో ఆగక రేపు ఒకే మతం అంటాడేమో అనే సందేహం కలుగుతోంది. భారత రాజ్యాంగం ప్రకారం ప్రజల కోరికలు, ఆశలు, సమస్యలు తీర్చమని ఎన్నుకుంటే దానికి తిలోదకాలిచ్చి రాజ్యాంగాన్ని చెత్తబుట్టలో తొక్కి తమ ఇష్టంవచ్చినట్లు పాలన సాగించే దిశలో బీజేపీ ప్రవర్తిస్తోంది. భారతదేశాన్ని హిందూ దేశమని, హిందువులు నివసించే దేశమని హితవు పలుకుతున్నారు. వీటో పవరు ఇచ్చినట్లుగా మాట్లాడుతున్నారు. ప్రశ్నించేవారికి చెరసాల తప్పదన్నట్లుగ పాలన సాగిస్తున్నాడు. అవును నాకుతెలియక అడుగుతాను వాళ్లు మెచ్చుకుని కొలుస్తున్న పురాణ పురుషులందరు వావివరుసలకు భిన్నంగా జన్మించినవారే కదా. మరి వారికిలేని కులం, మతం వీరికెందుకు? ప్రస్తుతం హిందువులు కొలిచే దేవుళ్లకు కులమతాలు లేవు. కాని రామరాజ్యం కోరుకునే బీజేపీ వారికి కులం, మతం అవసరం. అందుకోసం ఎంతటికైనా తెగిస్తారు. అవును బావ ప్రస్తుతం మానవాళి ద్వంద ప్రమాణాలతో జీవించవలసిన పరిస్థితి ఉంది. రాతిని పనిముట్లకు వాడుకున్నా ఆటవిక మానవుడు తన మేధస్సును ఉపయోగించి నేడు రాకెట్ తయారు చేసుకుని చేస్తున్న విశ్వాన్వేషణలో భాగంగా చంద్రమండలంపై కాలుమోపారు. ఆ ప్రాంతానికి శక్తిథామ్ అని పేరుపెట్టిన ప్రధాని మోదీకి ఏ శాస్త్రవేత్త పేరు గుర్తుకు రాకపోవడం శోచనీయం. మానవ సహేతుక చింతనతో మతాలను, వాటి నమ్మకాలను వదలి వైజ్ఞానిక తాత్విక విప్లవానికి తెరలేపాడు. సహేతుక చింతన విచక్షణ వివేకాలతో మానవాభివృద్ధివైపు ప్రయాణిస్తున్నాడు. అటువంటి మనిషిని మతంపేరుతో మూఢనమ్మకాలతో మానవ మేధస్సును నిద్రపుచ్చడం మతప్రచారకుల కర్తవ్యంగా కనబడుతోంది. అటువంటి ప్రచారకులకు బాసటగ నిలిచి మనిషిని బానిసగ మార్చే ప్రయత్నంలో బీజేపీ పయనించడం కడుశోచనీయం. ఒకే దేశం, ఒకే జాతి అంటూ తర్వాత ఒకే పార్టీ అనేందుకు సిద్ధపడుతున్న బీజేపీకి వ్యతిరేకంగా స్వేచ్ఛా వాదులు నడుంబిగించవలసిన సమయం ఆసన్నమైంది.

సెల్:9885569394

ఆపిల్ రైతులకు మోదీ ప్రభుత్వం షాక్

అమెరికా అధ్యక్షుని ప్రసన్నం చేసుకోవడానికి మన ప్రధానమంత్రి మోదీ అమెరికా నుంచి దిగుమతి అవుతున్న యాపిల్స్‌పై విధించే సుంకం ఇరవైశాతం తగ్గించడానికి నిర్ణయం చేశారు. దిల్లీలో జరిగే జీ20 సదస్సుకు వచ్చిన అమెరికా అధ్యక్షుడు బైడెన్ కన్నుల్లో ఆనందం చూడడానికి ఈనెల ఐదో తేదీ నుండి ఈ నిర్ణయం అమలు జరిగే విధంగా చర్యలు తీసుకున్నారు. పర్యవసానంగా ఆపిల్ పంట ప్రముఖంగా పండించే కాశ్మీర్ ప్రాంత రైతులు తీవ్రంగా దెబ్బతినే అవకాశంఉంది. మన దేశంలో పండే ఆపిల్‌పంటలో దాదాపు 70శాతం కంటే ఎక్కువ యాపిల్స్ కాశ్మీరులోనే పండుతాయి. గత ఏడాదిలో సుమారు 21లక్షల టన్నులు కాశ్మీర్‌లోనే పండాయి. సుమారు 14 వేల కోట్ల రూపాయలు ఆపిల్ పంట ద్వారా ఆ రాష్ట్ర రైతులు ఆదాయం పొందారు. ఈ పంటపై దాదాపు 30 లక్షలమంది పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి బతుకుతున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించే అమెరికన్ కార్పొరేట్ వ్యవసాయదారులు తక్కువ ఖర్చుతోనే ఆపిల్‌సాగు చేయగలుగుతున్నారు. వారికి అక్కడి ప్రభుత్వం ఎక్కువగా రాయితీలు ఇస్తుంది. అందువల్ల ఆ రైతులకి ఆపిల్ ఉత్పత్తి అతి తక్కువ వ్యయంతోనే జరుగుతుంది. అలాంటి కార్పొరేట్ కంపెనీలతో మనదేశంలోని సన్న, చిన్నకారు రైతులు పోటీ పడలేరు. వ్యవసాయం గిట్టుబాటు కాక బతకడం కష్టమై భూములొదులుకొని కూలీలుగా మారే ప్రమాదంఉంది. ఈ నిర్ణయంద్వారా మోదీ ఒక్క దెబ్బకు రెండు పిట్టలు సామెతగా రెండు ప్రయోజనాలు ఆశిస్తున్నారు. అమెరికాకు ప్రయోజనం కలిగించి వాళ్ళని ఆనంద పరచడం, రెండోవైపు కాశ్మీర్ రైతులను దివాలా తీయించి వ్యవసాయం గిట్టుబాటు కాకుండాచేసి అక్కడ భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం. దాని కోసమే ఈ నిర్ణయం చేశారని పరిశీలకులు భావిస్తున్నారు. 370 అధికరణను రద్దుచేసి అక్కడ ఎవరైనా భూములు కొనుక్కోవడానికి అవకాశాలు కలిగించినప్పటికీ అక్కడ రైతులు భూమిని నమ్ముకుని బతుకుతూ భూములు అమ్మడంలేదని కార్పొరేట్ శక్తులు బాధపడుతున్నాయి. మోదీ దేశభక్తి ఎంత గొప్పదో రైతులపై తనకున్న ప్రేమ ఎటువంటిదో దీనితో అర్థమవుతుంది. 2013లో తీసుకొచ్చిన భూసేకరణచట్టానికి బీజేపీ ప్రభుత్వం సవరణచేసి రైతుల ఇష్టాలతో సంబంధంలేకుండా భూములను కార్పొరేట్లకు కట్టపెట్టటానికి చేసిన ప్రయత్నం ప్రపంచానికి తెలుసు. మూడు నల్లచట్టాలు తీసుకుని వచ్చి రైతులకు గిట్టుబాటు ధరలేకుండాచేసి భూములు మొత్తం కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు చేసిన ప్రయత్నాన్ని దేశంలో రైతాంగం పెద్ద ఎత్తున ఉద్యమించి ఈ చట్టాలను తిప్పికొట్టింది. అయినా సరే ఇప్పటికీ రైతులకు గిట్టుబాటుధర ఇవ్వడానికి ప్రభుత్వం నిరాకరిస్తున్నది. ఈరోజు ఎలక్ట్రిసిటీ బిల్లుకు సవరణ తీసుకువచ్చి రైతులకు ఉచిత కరెంటు రద్దుకు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నది. మోదీ సంతోషం కోసమే జగన్ ప్రభుత్వం రైతుల మోటర్లకు మీటర్లుపెట్టే ప్రయత్నంచేస్తున్న విషయం మనకు అందరికీ తెలుసు. రైతువ్యతిరేక ధోరణి మోదీ కొనసాగిస్తున్నాడు.

కె కుమార్ రెడ్డి
తిరుపతి

మహిళా రిజర్వేషన్ బిల్లుతో బీజేపీకి చిక్కులు...?

జ్ఞాన్ పాఠక్

తాజాగా పార్లమెంటులో ఆమోదం పొందిన "మహిళా రిజర్వేషన్" బిల్లు ప్రస్తుతం రాజకీయంగా సరైందే. అయితే ఈ మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదంతో 2024 లోకసభ ఎన్నికల్లో ఒకే రాజకీయ పార్టీ లేదా కూటమికి అత్యంత ప్రయోజనం కలుగుతుందా..? అనేది కీలక అంశం. ఈ ఘనత ప్రధాని నరేంద్ర మోదీదేనని ఆర్ఎస్ఎస్-బీజేపీ ప్రచార యంత్రాంగం పూర్తిస్థాయిలో ప్రచారం సాగిస్తోంది. ఈ రిజర్వేషన్ బిల్లు అమలు ఎప్పుడవుతుందో నిర్ధారణలేకండా ప్రకటించడం ఎందుకు, జాప్యం చేయడానికి వెనుక ఉన్న టక్కుటమారాలను బైటపెట్టేందుకు ప్రధాన ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ప్రయత్నిస్తోంది. భవిష్యత్‌లో అన్నీ చేస్తానని వాగ్దానం చేయడం మోదీకి తొలినుండి ఉన్న అలవాటు.

1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ హయాంలో సీపీఐ నాయకురాలు గీతా ముఖర్జీ జాయింట్ పార్లమెంటరీ కమిటీకి నాయకత్వం వహించిన సమయంలో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రతిపాదన తీసుకొచ్చారు. అయితే ఓబీసీల రిజర్వేషన్లకు సంబంధించి భిన్నాభిప్రాయాల కారణంగా ఈ బిల్లు ఆమోదం పొందలేదు. యుపిఎ నేతృత్వంలో 2008లో మహిళా రిజర్వేషన్ బిల్లును మళ్లీ ప్రవేశపెట్టారు. అయితే అదీ కార్యరూపం దాల్చలేదు. తొమ్మిదేళ్ల పాలన తర్వాత 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రధాని మోదీ ప్రభుత్వం ఈ బిల్లును మళ్లీ తెరపైకి తీసుకొచ్చింది.

2022 సంవత్సరంనాటికి, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, అందరికీ వసతి సౌకర్యం, మరో 38 ఇతర అంశాలు అమలు చేస్తానని మోదీ వాగ్దానం చేసిన మాట తెలిసిందే. ఇవి నెరవేర్చకముందే తాజాగా దేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా రూపొందిస్తానని మోదీ తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మరింత మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. దీనిలో భాగంగానే తాజాగా మహిళా రిజర్వేషన్ అమలు ప్రక్రియ తెరపైకి వచ్చింది. నియోజకవర్గాల విభజన ప్రక్రియ, జనాభా లెక్కల అనంతరం 2029 ఎన్నికల నాటికి ఈ బిల్లును అమలుచేస్తారని తెలుస్తోంది.

ప్రధాని మోదీ 2022 నాటికి అమలు చేస్తానన్న 40 వాగ్దానాల అమలు వ్యవహారాన్ని పరిశీలిస్తే తాజాగా చేపట్టిన మహిళా రిజర్వేషన్‌బిల్లు లక్ష్యం కూడా విఫలంఅయ్యే అవకాశం ఉంది. ఈ బిల్లు అమలును పునర్విభజన, జనాభాగణనతో ముడిపెట్టడం అతి పెద్ద సమస్య. మోదీ ప్రభుత్వం ఎన్నికల నేపథ్యంలో పన్నిన ఈ పన్నాగంతో భారతీయ మహిళలు 2039

వరకు రిజర్వేషన్ అమలుకోసం వేచిచూడాల్సిందేనని నిపుణులు భావిస్తున్నారు.

ఆర్ఎస్ఎస్-బీజేపీ ఎన్నికల ప్రచార యంత్రాంగం మహిళా రిజర్వేషన్‌పై ప్రధాని మోదీ నిర్ణయాన్ని ఛాంపియన్‌గా అభివర్ణించింది. పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదంపై బీజేపీ మహిళా నాయకులు, కార్యకర్తలు ప్రత్యేకంగా మోదీకి ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ తన నిబద్ధతను నెరవేర్చారని ప్రశంసించారు. ఈ మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం 2024 లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయంగా తమకు మేలు చేస్తుందనేది బీజేపీ భావన. ముఖ్యంగా దేశంలోని ప్రతిపక్ష రాజకీయ పార్టీలు మహిళలపై బీజేపీ నాయకత్వం ఆడిన నాటకాన్ని బహిర్గతం చేయడానికి సిద్ధంగా ఉన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు తక్షణం అమలులోకి రాకుండా జాప్యం చేయడాన్ని విపక్షాలు తీవ్రంగా పరిగణించాయి. 2024 ఎన్నికల్లో ఏ రాజకీయపార్టీ ప్రయోజనం పొందుతుందనేది ముఖ్యంగా మహిళా ఓటర్లను ఏ రాజకీయ పార్టీ ప్రభావితం చేస్తుందనేదానిపై ఆధారపడి ఉంటుంది.

మహిళా రిజర్వేషన్ బిల్లును 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం మొట్టమొదటిసారి రూపకల్పన చేసింది. రిజర్వేషన్ బిల్లుపై పార్లమెంటులో చర్చ జరుగుతున్నప్పుడు ప్రతిపక్షాలు చెప్పినవిధంగా ఈ బిల్లులో పలు లోపాలున్నాయి. అయితే ఇది ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే రూపొందించిందనేది మరో వాదన. ఎందుకంటే ప్రభుత్వం ఈ చట్టాన్ని తక్షణమే అమలు చేయ కూడదనేది ప్రభుత్వ ఉద్దేశం. నియోజకవర్గాల పునర్విభజన కమీషన్ దాని అమలుకు సంబంధించిన సమస్యను పరిశీలిస్తుంది తప్ప, లేవనెత్తిన ప్రశ్నలకు కేంద్ర న్యాయమంత్రి, కేంద్ర హోం మంత్రి వద్ద సమాధానం లేదు.

మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ కోటా కల్పించకపోవడం బీజేపీ ప్రభుత్వ 'కుటిలయత్నం'గా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. కుల గణన, ఓబీసీ కోటా సమస్య ప్రస్తుతం దేశంలో ప్రధాన సమస్యగా ఉంది. ఇది బిహార్ నుండి మహారాష్ట్ర వరకు విస్తరించింది. "పార్లమెంటులో నేను, 90మందిలో ముగ్గురు మాత్రమే ఓబీసీ కమ్యూనిటీకి చెందినవారమా? అని రాహుల్ ప్రశ్నించారు. మోదీ ప్రతిరోజూ ఓబీసీల గురించి మాట్లాడుతారుగాని ఆయన వారికోసం ఏమి చేసాడు? మహిళా రిజర్వేషన్ కోటాను వాయిదా వేయడానికి పునర్విభజన, జనాభా గణన "పేలవమైన సాకులు"గా రాహుల్ అభివర్ణించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఖచ్చితమైనది, అనుకూలమైనది అయినప్పటికీ ఈ బిల్లు అనిశ్చితంగా ఉందని సామాజిక శాస్త్రవేత్త యోగేంద్ర యాదవ్ వ్యాఖ్యానించారు. "స్వాతంత్ర్యం తర్వాత భారతదేశంలో ప్రజాస్వామ్య సంస్కరణల్లో భాగంగా మహిళా రిజర్వేషన్ బిల్లును అమలుచేయడం హాస్యాస్పదమైన మార్గంగా పేర్కొన్నారు. ఈ బిల్లులో మోసం, అసంబద్ధత, అనిశ్చితిని సూచిస్తున్నాయన్నారు. అసాధారణమైన రాజ్యాంగ సాధనంలేకపోతే 2039 వరకు వేచిచూడాలి అని యోగేంద్ర యాదవ్ వ్యాఖ్యానించింది.

పార్లమెంటులో చర్చల సమయంలో కూడా మేము బిల్లులోని క్లిష్టమైన సమస్యలను చర్చించామని బీజేడీ ఎంపీ భర్తృహరి మహతాబ్ పేర్కొన్నారు. తుది బిల్లు లోకసభలో ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఆమోదం జరిగినప్పుడు కూడా మొత్తం సీట్లలో మూడింట ఒక వంతు మహిళలకు రిజర్వు చేయాలని ఎందుకు బిల్లులో పేర్కొనలేదు? అని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర స్థాయిలో రొటేషన్ ప్రాతిపదికన లేదా సామాజిక న్యాయపరంగా మహిళలకు ఎప్పుడు న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. ఎన్నికల అనంతరం జరిగిన పరిణామాల్లో బీజేపీకి రాజకీయంగా బీజేడీ ముఖ్యమైనదప్పటికీ, ఒడిశాలో ఒకరిపై ఒకరు పోటీచేసే అవకాశం ఉంది.. బీజేడీ కూడా బీజేపీ గేమ్ ప్లాన్‌ను బట్టబయలు చేయాలనుకుంటున్నట్లుగా దీన్నిబట్టి తెలుస్తోంది. ఆర్థిక శాఖమంంరతి నిర్మలా సీతారామన్ రాజ్యసభలో ఈ బిల్లుకు సంబంధించిన చట్టబద్ధతలను వివరిస్తూ ప్రతిపక్షాలు ఆరోపించినట్లు ఇది "జుమ్లా కాదు" అని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించి బీజేపీ, ఇండియా కూటమి వీరిలో ఓటర్లను ఎవరు మెప్పించగలరో వారే ఎన్నికల్లో లాభపడే అవకాశం ఉంది.

సిక్సర్ల వర్షానికి బ్యాట్‌లు సిద్ధం

- భారత్‌లో క్రికెట్ ప్రపంచ కప్ ఉత్సాహం
- జమ్ముకశ్మీర్‌లో బ్యాట్‌ల తయారీదారులకు డిమాండ్

సంగం : క్రికెట్ ప్రపంచ కప్‌కు ఉత్సాహం భారత క్రీడాభిమానుల్లో మిన్నంటింది. ఇది జమ్ముకశ్మీర్‌లోని బ్యాట్ తయారీదారులకు ఎనలేని డిమాండ్ చేకూర్చింది. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన నిపుణుడైన బ్యాట్ తయారీదారుడు సునీల్ కుమార్ సంగమ్‌ను ఆకర్షించబడిన అనేక మంది నిపుణులైన కళాకారుల్లో ఒకరు. ఆయనతో పాటు దక్షిణ కశ్మీర్ పట్టణంలోని తయారీదారులు వచ్చే వారం ప్రారంభం కానున్న క్రికెట్ ప్రపంచ కప్‌కు ముందు ఆర్డర్లలో పెరుగుదలను చూశారు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) నిర్వహించే ప్రతి బహుపాక్షిక ఈ క్రీడా పోటీకి ముందు కశ్మీర్‌లో తయారైన బ్యాట్‌ల అమ్మకాలు పుంజుకున్నప్పటికీ, 12 సంవత్సరాల విరామం తర్వాత భారతదేశం క్రికెట్ ప్రపంచ కప్‌ను నిర్వహిస్తున్నందున ఈ సంవత్సరం ఆర్డర్లు ఎక్కువగా ఉన్నాయి. 'క్రికెట్ ప్రపంచ కప్ సమీపిస్తుండటంతో బ్యాట్‌లకు డిమాండ్ బాగా పెరిగింది. మేము అన్ని ఆర్డర్‌లను పూర్తి చేయలేకపోతున్నాము' అని కుమార్ పీటీఐకి చెప్పారు. ఎక్కువ పని చేస్తే అధిక సంపాదనగా మారుతుందని, అయితే కుమార్ తాను తయారుచేసే బ్యాట్‌లు అంతర్జాతీయ క్రికెట్‌కు చేరుకుంటాయని సంతోషిస్తున్నాడు. 'నాకు బ్యాట్ తయారీదారుగా 20 సంవత్సరాల అనుభవం ఉంది. ప్రముఖ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, కె.ఎల్.రాహుల్, ఆండ్రూ రస్సెల్, డ్వేన్ బ్రావో వంటి వారికి బ్యాట్‌లు తయారు చేశాను' అని కుమార్ చెప్పారు. కశ్మీర్ క్రికెట్ బ్యాట్ తయారీదారుల సంఘం ప్రతినిధి ఫౌజుల్ కబీర్ మాట్లాడుతూ కశ్మీర్ విల్లో బ్యాట్‌లను అంతర్జాతీయ టోర్నమెంట్లలో ఉపయోగించడానికి ఐసీసీ అనుమతి మంజూరు చేసిన తర్వాత గత రెండేళ్లుగా వాటికి డిమాండ్ క్రమంగా పెరుగుతోందన్నారు. 'మేము 102 సంవత్సరాలుగా క్రికెట్ బ్యాట్‌లను తయారు చేస్తున్నాము. కానీ 2021 వరకు జాతీయ లేదా అంతర్జాతీయ గుర్తింపు లేదు. ఐసీసీ ఆమోదం పొందిన తర్వాత, మా బ్యాట్‌లు వివిధ అంతర్జాతీయ టోర్నమెంట్లలో కనిపించాయి. డిమాండ్ చాలా రెట్లు పెరిగింది' అని తయారీదారు కబీర్ చెప్పారు. ప్రపంచ క్రికెట్ బ్యాట్‌ల డిమాండ్‌లో 80 శాతం కశ్మీర్‌లో ఉందని అన్నారు. 'ప్రపంచ కప్‌కు భారత్ ఆతిథ్యమివ్వడంతో డిమాండ్ చాలా రెట్లు పెరిగింది. మేము సంవత్సరానికి 30 లక్షల బ్యాట్‌లను తయారు చేస్తాము. అయితే ఈ నెల, మునుపటి వాటికి డిమాండ్ 15 రెట్లు ఎక్కువగా ఉంది. మేము డెలివరీ చేసిన రెండు నెలల్లో 30 నుంచి 40 లక్షల బ్యాట్‌లను తయారు చేశాము' అని ఆయన వివరించారు. 'జీరో ఎగుమతులు' నుంచి 2021 వరకు కశ్మీర్ నుంచి 1.85 లక్షల కంటే ఎక్కువ బ్యాట్‌లు వివిధ దేశాలకు ఎగుమతి అయ్యాయని కబీర్ తెలిపారు. 'మేము ప్రపంచానికి కశ్మీర్ విల్లో రూపంలో మెరుగైన ప్రత్యామ్నాయాన్ని అందిస్తున్నాము. అది కూడా తక్కువ ధరకు. నాణ్యత పరంగా కూడా మీరు మా బ్యాట్‌ను చూస్తే, (టి 20) ప్రపంచ కప్‌లో ఒక ఆటగాడు మా బ్యాట్‌ని ఉపయోగించి అతిపెద్ద సిక్స్ కొట్టాడు' అని అన్నారు. ఈ ప్రపంచ కప్‌లో కనీసం 17 మంది ఆటగాళ్లు తన కంపెనీ బ్యాట్‌లను ఉపయోగిస్తున్నారు. బ్యాట్ తయారీ యూనిట్‌లో పని చేస్తున్న ముస్తాక్ అహ్మద్ షేక్ మాట్లాడుతూ తమ వేతనాలు పెరగడంతో ఇక్కడి కార్మికులు ప్రపంచ కప్ కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. 'మేము ఎల్లప్పుడూ ప్రపంచ కప్ కోసం ఎదురు చూస్తాము. ఎందుకంటే మా పని చాలా రెట్లు పెరుగుతుంది. మాకు రెట్టింపు వేతనాలు లభిస్తాయి. ఇదే మాకు జీవనాధారం అయినందున ఈ రోజుల్లో పగలు రాత్రి పని చేస్తున్నాం' అని వివరించారు. ప్రపంచ కప్ సమయంలో కొనుగోలుదారులు తమ ఆర్డర్లను మూడు నుంచి నాలుగు రెట్లు పెంచుకుంటారని షేక్ చెప్పారు. 'సాధారణంగా 1,000 బ్యాట్లను ఆర్డర్ చేసే వారు ఇప్పుడు 3 వేల నుంచి 4 వేల బ్యాట్లను అడుగుతారు' అని అన్నారు. రంజీ ట్రోఫీలో ఆడిన జమ్ముకశ్మీర్‌కు చెందిన మాజీ క్రికెటర్ ఒమర్ ఆలం మాట్లాడుతూ కశ్మీర్ విల్లో బ్యాట్‌ల నాణ్యతను మెరుగుపరచడానికి పెట్టుబడి ఇప్పుడు డివిడెండ్లను చెల్లిస్తోందన్నారు. 'పెట్టుబడిదారులు అద్భుతమైన పని చేస్తున్నారు. కశ్మీరీ తయారీదారులు యువకులతో పాటు అంతర్జాతీయ ఆటగాళ్లకు బ్యాట్‌లను అందజేస్తున్నారు' అని ఆలం అన్నారు. కశ్మీర్ విల్లో బ్యాట్‌లు వాటి మన్నిక కారణంగా ఇంగ్లీష్ విల్లో నుంచి తయారు చేయబడిన వాటి కంటే మంచివని అతను భావిస్తున్నారు. 'కశ్మీర్ (విల్లో) బ్యాట్‌లు చాలా చౌకగా ఉంటాయి. అవి ఎక్కువ కాలం పని చేస్తాయి. ఇంగ్లీషు విల్లో బ్యాట్‌లను ఒక సీజన్‌కు వాడతారు. కానీ కశ్మీర్ విల్లో బ్యాట్‌లు రెండు మూడు సీజన్‌ల వరకు ఉంటాయి. అంతర్జాతీయ ఆటగాళ్లు ఈ బ్యాట్‌లతో ఆడటం మనం చూశాం. దానికి మంచి స్కోప్ వచ్చింది' అన్నారాయన.

కొత్త వంగడాల సృష్టికర్త స్వామినాథన్



చెన్నై: కొత్త వంగడాలు సృష్టించి దేశంలో వ్యవసాయ గతిని మార్చిన మహనీయుడు స్వామినాథన్. వ్యవసాయం ఆర్థికంగా లాభసాటిగా మారాల్సి ఉందని ఎంఎస్ స్వామినాథన్ పరితపించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుంటేనే దేశం బాగుంటుందని గట్టి నమ్మకంతో కొత్త వంగడాలు సృష్టించి దేశంలో వ్యవసాయం గతిని మార్చారు. ఆధునిక పద్ధతులతో అధిక ఫలసాయం సాధ్యమనేది ఆయన ప్రగాఢ విశ్వాసం. 1960, 70దశకంలో భారత్ ఆహార సంక్షోభం ముప్పును ఎదుర్కొన్న సమయంలో భిన్న వ్యవసాయ పరిస్థితులను ఎదుర్కొని అధిక దిగుబడులిచ్చే పంటల అవసరం ఏర్పడింది. అప్పటికే వ్యవసాయంలో కీలక పరిశోధనలు చేస్తున్న స్వామినాథన్ అధిక దిగుబడులు ఇచ్చే గోధుమ, వరి రకాలను అభివృద్ధి చేసి చరిత్ర సృష్టించారు. ఆయన చేసిన కృషి.. వాటిని ఇక్కడ అమలు చేయడం భారత్‌లో హరిత విప్లవానికి నాంది పలికింది. అనంతరం అది భారత వ్యవసాయ పద్ధతుల ముఖచిత్రాన్నే మార్చివేసింది. దేశ వ్యవసాయ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు దోహదం చేయడంతోపాటు కోట్ల మందికి ఆహార భద్రతను కల్పించింది.

రైతులకు మద్దతు ధర కోసం ఆయన నేతృత్వంలో ఓ ఫార్ములా రూపొందించారు. రైతుల పంట ఉత్పత్తి వ్యయంపై కనీసం 150శాతం (సీ2 +50%) దక్కేలా ప్రభుత్వం కనీస మద్దతు ధర నిర్ణయించాలనేది దీని ఉద్దేశం. రైతులు చెల్లించేసిన వ్యయాలు, కుటుంబ శ్రమ విలువ, సొంత మూలధన ఆస్తుల విలువపై వడ్డీ, భూమికి చెల్లించిన కౌలు, సొంత భూమికి కౌలు విలువ వంటి వ్యయాలన్నీ జతచేర్చి సీ2గా వ్యవహరించారు. వీటికి అదనంగా 50శాతం కలిపి కనీస మద్దతు ధర నిర్ణయించాలనేది ఈ ఫార్ములా లక్ష్యం. రైతుల సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ఎన్‌సీఎఫ్ సిఫార్సులే తగినవని స్వామినాథన్ ప్రగాఢ విశ్వాసం.

వ్యవసాయ పరిశోధన శకం ముగిసింది

స్వామినాథన్ మృతిపై ఐఏఆర్ఐ చీఫ్

న్యూదిల్లీ : వినూత్న ఆవిష్కరణలతో గుర్తించబడిన వ్యవసాయ పరిశోధన, విద్య, విస్తరణ యుగం ఎం.ఎస్.స్వామినాథన్ మరణంతో ముగిసిందని భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐఏఆర్ఐ) డైరెక్టర్ ఎ.కె.సింగ్ గురువారం తెలిపారు. భారతదేశంలో హరిత విప్లవ పితామహుడిగా పేరొందిన ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ (98) వృద్ధాప్య అనారోగ్యంతో గురువారం చెన్నైలో కన్నుమూశారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. 'ప్రొఫెసర్ స్వామినాథన్ మరణించడంతో వినూత్న ఆవిష్కరణలతో నిండిన వ్యవసాయ పరిశోధన, విద్య, విస్తరణ యుగం ముగిసింది. మహాత్మా గాంధీ చెప్పినట్లుగా పేదలు, ఆకలితో ఉన్నవారికి రొట్టె రూపంలో దేవుడు కనిపిస్తే, ఆ దేవుడు డాక్టర్ స్వామినాథన్. ప్రతిరోజూ భోజనం చేసేటప్పుడు ప్రతి పౌరుడు పూజించాలి' అని సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో కొంతకాలంగా చికిత్స పొందుతున్నట్లు ఎం.ఎస్.స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ వర్గాలు తెలిపాయి.

ఆవులను కసాయి వాళ్లకు అమ్ముకుంటున్నారు

ఇస్కాన్‌పై మేనకాగాంధీ సంచలన ఆరోపణలు

న్యూదిల్లీ: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సమాజం(ఇస్కాన్)పై కేంద్ర మాజీమంత్రి, బీజేపీ ఎంపీ మేనకాగాంధీ సంచలన ఆరోపణలు చేశారు. తమ గోశాలలోని ఆవులను ఇస్కాన్ కసాయి వాళ్లకు అమ్ముంటుకుంటుందని ఆరోపించారు. దేశంలోనే ఇస్కాన్ అతిపెద్ద మోసకారి అని ఆమె మండిపడ్డారు. దీనికి సంబంధించి ఆమె మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జంతు హక్కుల కార్యకర్తగా ఉన్న మేనకా గాంధీ ఆ వీడియలో మాట్లాడుతూ 'దేశంలోనే అతిపెద్ద మోసకారి ఇస్కాన్. గోశాలల ఏర్పాటుకు భూమి, వాటి నిర్వహణ రూపంలో ప్రభుత్వం నుంచి భారీగా ప్రయోజనాలు పొందుతోంది' అని అన్నారు. మతపరమైన సంస్థ అయినా ఇస్కాన్‌పై తీవ్రస్థాయిలో విరుచుపడిన మేనకా గాంధీ తాను ఇటీవల ఏపీలోని అనంతపురం జిల్లాలో గల ఓ గోశాలను సందర్శించినప్పుడు అక్కడ ఒక్క ఆవు కూడా కనిపించలేదని తెలిపారు. అక్కడ ఉన్న ఆవులన్నిటినీ విక్రయించారని ఆమె ఆరోపించారు. 'నేను ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అనంతపురం గౌశాలను సందర్శించాను. అక్కడ ఒక్క ఆవు కానీ, దూడ కానీ కనిపించలేదు. అంటే అవన్నీ అమ్ముడయ్యాయి' అని మేనకా గాంధీ ఆరోపించారు. ఇస్కాన్ తన ఆవులన్నింటినీ కసాయి వాళ్లకు అమ్ముకుంటోందన్నారు. మేనకా గాంధీ ఆరోపణలపై ఇస్కాన్ స్పందించింది. ఆమె చేసిన ఆరోపణలను ఖండించింది. ఆరోపణలు నిరాధారమైనవని, అబద్ధమని పేర్కొంది. ఆమె ప్రకటనను చూసి తాము ఆశ్చర్యపోయినట్టు తెలిపింది. గొడ్డు మాంసం ప్రధాన ఆహారంగా ఉన్న ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో గోసంరక్షణకు ఇస్కాన్ కృషి చేసిందని ఆ సంస్థ జాతీయ ప్రతినిధి యుధిష్టిర్ గోవింద దాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

కనీసం మృతదేహాలైనా అప్పగించండి

వేడుకుంటున్న మణిపూర్ విద్యార్థుల తల్లిదండ్రులు

ఇంఫాల్ : మణిపూర్‌లో ఇద్దరు విద్యార్థుల హత్య ఘటన వారి తల్లిదండ్రులకు రోదనే మిగిల్చింది. కనీసం తమ పిల్లల మృతదేహాలను అంత్యక్రియల కోసమైనా అప్పగించాలని ప్రభుత్వాన్ని వారు అభ్యర్థించారు. ఈ ఘటన రెండు రోజులుగా ఇంఫాల్ లోయలో తీవ్ర నిరసనలకు కారణమైంది. హత్యకు గురైన వారి చిత్రాలు సామాజిక మాధ్యమంలో వైరల్ కావడంతో ఆ విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం తమ పిల్లల మృతదేహాలను గుర్తించాలని, తద్వారా బాలుడు, బాలిక మృతదేహాలకు గౌరవంగా అంత్యక్రియలు నిర్వహించేలా చూడాలని అధికారులను వేడుకున్నారు. ఈ ఏడాది జులైలో అదృశ్యమైన వీరిద్దరి మరణంపై దర్యాప్తులో సీబీఐ నుంచి అధికారులు చేరడంతో వారి మృతదేహాలు ఎక్కడ ఉన్నాయో మిస్టరీ వీడుతుందని వారు ఆశించారు. 18 ఏళ్ల బాలిక తండ్రి హిజామ్ కులజిత్ పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో 'మేము మా పిల్లలను చివరిసారిగా చూడాలనుకుంటున్నాము. తగిన గౌరవంతో వారి అంత్యక్రియలను నిర్వహించాలనుకుంటున్నాము. ఈ నష్టాన్ని ఏదీ భర్తీ చేయదు. మైతేయి ఆచారం ప్రకారం, అంత్యక్రియలు నిర్వహించి, వారికి వీడ్కోలు పలికేందుకు వారు ధరించిన దుస్తులలో కనీసం కొంత భాగం కావాలి' అని అన్నారు. 'నేను ఆమె ఫొటో చూసినప్పుడల్లా అది నన్ను పూర్తిగా అశాంతికి గురిచేస్తుంది. నా హృదయంలో నేను శాంతిని పొందలేను. మా కుమార్తె ఫొటోను ఆలింగనం చేసుకుంటూ ఆమె తల్లి స్నృహ కోల్పోయి మంచం పట్టింది' అని కులజిత్ చెప్పారు. జులై 6న ఇద్దరు అదృశ్యమయ్యారు. చివరిసారిగా బిష్ణుపూర్ జిల్లాలోని నంబోల్ వద్ద సీసీటీవీ కెమెరా ఫుటేజీలో కనిపించారు. వారి ఫోన్లను పోలీసులు కుకీ ప్రాబల్యం ఉన్న చురాచంద్‌పూర్ జిల్లాలోని లామ్‌డాన్ వద్ద ట్రాక్ చేశారు. 'ఒక రోజు వరకు, వారు పారిపోయారని మేము భావించాము. కానీ బాలుడి కుటుంబాన్ని సంప్రదించిన తర్వాత, మేము వారు అదృశ్యమైనట్లు గ్రహించాము. వారిని ఎందుకు చంపవలసి వచ్చిందో నాకు అర్థం కాలేదు' అని కులజిత్ అన్నారు. అయితే, 20 బాలుడి కుటుంబం తీవ్ర ఆవేదనలో ఉంది. కొడుకు ఇక లేడని నమ్మలేక అతని తల్లి రోజూ వంట చేస్తూనే ఉంది. 'ఇప్పటికి రెండున్నర నెలలైంది. కానీ నేను నా కొడుకు దుప్పటిని ఉతకలేదు' అని ఆమె చెప్పింది. మైతేయి ఆచారం ప్రకారం, తల్లులు ఇద్దరూ అంత్యక్రియలు నిర్వహించే వరకు ప్రతిరోజూ తమ పిల్లల ఛాయాచిత్రాల ముందు అగరబత్తులు, కొవ్వొత్తులు, కొద్దిపాటి ఆహారాన్ని అందిస్తారు. తమ పిల్లల మృతదేహాలను వెలికితీసేందుకు, ఎందుకు హత్య చేశారో వెల్లడించేందుకు సీబీఐ విచారణ దోహదపడుతుందని ఆ రెండు కుటుంబాలు భావిస్తున్నాయి. ఇదిలాఉండగా, ఇద్దరు మణిపురి విద్యార్థులను అపహరించి, చంపిన వారిని అరెస్టు చేసి శిక్షిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తనకు హామీ ఇచ్చారని ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్ బుధవారం చెప్పారు. సీబీఐ స్పెషల్ డైరెక్టర్ అజయ్ భట్నాగర్ నేతృత్వంలోని అధికారుల బృందం బుధవారం రాష్ట్రానికి చేరుకుని, ఇంఫాల్ లోయను కుదిపేసిన ఈ హత్యా ఘటనపై విచారణ ప్రారంభించింది. రెండు రోజులుగా రాష్ట్ర రాజధాని వీధుల్లో విద్యార్థులు, యువకుల హింసాత్మక నిరసనలకు దారితీసింది. 60 మందికి పైగా గాయపడ్డారు. మరోవైపు ఇంఫాల్ తూర్పు, పశ్చిమ జిల్లాల్లో బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కర్ఫ్యూ సడలింపు రద్దయింది.

షిండే 'సేన'కు ఓటమి తప్పదు: రౌత్

ముంబై: మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వ శివసేన అభ్యర్థులకు వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పబోదని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ అన్నారు. ఆయన ముంబైలో విలేకరులతో మాట్లాడుతూ సీఎంపై విమర్శలు చేశారు. విదేశీ పర్యటనపై మొగ్గుచూపుతున్న షిండే... రాష్ట్రంలోని రైతుల వెతలను పట్టించుకోవడం లేదని, వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన వారిని ఆదుకోవడం లేదని వ్యాఖ్యానించారు. తన విదేశీ పర్యటన ద్వారా ఎఫ్‌డీఐలను ఆకర్షించడానికి బదులు పక్కరాష్ట్రానికి మళ్లిన మహారాష్ట్రకు రావాల్సిన పెట్టుబడిని తిరిగి తేవాలని సీఎంనుద్దేశించి అన్నారు. శివసేన (యూబీటీ) నేత ఆదిత్య ఠాక్రే ఎక్స్ మాధ్యమంగా చేసిన పోస్టు క్రమంలో ఆయన తన విదేశీ పర్యటనను రద్దుచేసుకున్నారని రౌత్ తెలిపారు. అక్టోబరు 1 నుంచి 8వ తేదీ వరకు బ్రిటన్, జర్మనీలో షిండే పర్యటించాల్సి ఉండగా ప్రస్తుతానికి పర్యటన వాయిదా వేసినట్లు సీఎంఓ మంగళవారం ప్రకటించింది. రాష్ట్రంలో నీటి కొరత ఇతరత్ర అంశాల నేపథ్యంలో సీఎం తన పర్యటన రద్దు చేసుకున్నారన్న వార్తలపై వ్యంగ్యంగా స్పందించిన రౌత్... ఆదిత్య ట్వీట్ తర్వాతే ఆయనకు ఈ సవాళ్ల గురించి తెలిసిందా? అని ప్రశ్నించారు. అక్రమ కట్టడాలు, కబ్జాలతో ఇబ్బంది పడుతున్న నాగపూర్‌లో ఎందుకు పర్యటించలేదు? వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఎందుకు ఆదుకోలేదు? అని రౌత్ వరుస ప్రశ్నలు సంధించారు. సరైన నిర్ణయాలు తీసుకునే హక్కు కూడా లేదంటూ ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్‌ను కూడా ఆయన విమర్శించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై పార్లమెంటులో ఓటింగ్‌కు శివసేన (యూబిటీ) ఎంపీలు నలుగురు గైర్హాజరు కావడంపై ప్రశ్నకు 'ఇది చిన్న విషయం. నలుగురు లోక్‌సభ సభ్యులపై విప్ జారీ అవుతుంది' అని రౌత్ బదులిచ్చారు.

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

కోటా: రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల వరుస ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నామని పదేపదే చెప్తున్నప్పటికీ ఆత్మహత్యలు ఆగడంలేదు. తాజాగా బుధవారం మరణం చోటుచేసుకుంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన విద్యార్థి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డారని స్థానిక అధికారులు తెలిపారు. ఆ విద్యార్థి నీట్ కోసం కోటాలో సొంతంగానే సిద్ధం అవుతున్నారని తెలిపారు. వివిధ ఎంట్రెన్స్ టెస్టులు, పోటీపరీక్షల కోచింగ్ సెంటర్లకు ప్రసిద్ధి చెందిన కోటాలో ప్రతి సంవత్సరం ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది విద్యార్థులు వచ్చి శిక్షణ పొందుతారు. ఈ ఏడాది దాదాపు 2.5లక్షల మంది అక్కడ శిక్షణ తీసుకుంటున్నట్లు అంచనా. ఈ క్రమంలోనే అక్కడ విద్యార్థులు ఆత్మహత్యలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. గతేడాది 15 మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడగా ఈ ఏడాది ఆ సంఖ్య పెరుగుతూ వస్తోంది. తాజాగా యూపీ విద్యార్థి మరణంతో ఆ సంఖ్య 26కు చేరింది.ఈ బలవన్మరణాలను నిలువరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో రెండు నెలలపాటు కోటాలోని శిక్షణ కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి టెస్టులు నిర్వహించకూడదని స్థానిక యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు సెప్టెంబరు, అక్టోబరులో విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్లు జిల్లా అధికారులు తెలిపారు.

మోదీ ప్రభుత్వ వైఫల్యం వల్లే యువత ఆత్మహత్యలు: కాంగ్రెస్

న్యూదిల్లీ: నిరుద్యోగ సమస్యపై కాంగ్రెస్ పార్టీ గురువారం నరేంద్ర మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడింది. మోదీ ప్రభుత్వం భారతదేశ యువత ఆశలు , ఆకాంక్షలను అణిచివేసిందని... అందువల్లే వారిలో ఆత్మహత్యలు పెరుగుతున్నాయని విమర్శించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఓ ప్రకటన విడుదల చేశారు. సంక్షోభాన్ని పరిష్కరించడానికి చర్యలు చేపట్టడానికి బదులుగా కేంద్ర ప్రభుత్వం... నిరుద్యోగుల్లో ఆత్మహత్యల రేటు పెరుగుతున్న విషయాన్ని దాచిపెట్టడానికి 2022 నాటి నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) డేటాను మరుగునపర్చడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఇక్కడి ఆనంద్ విహార్ టెర్మినల్‌లో పోర్టర్‌లతో రాహుల్ గాంధీ సంభాషణను రమేశ్ ఉదహరించారు. ఇంజనీరింగ్ డిగ్రీలు ఉన్న వారితో సహా పెద్ద సంఖ్యలో విద్యావంతులైన యువకులు ప్రభుత్వ ఉద్యోగాలను పొందలేకపోతున్నారని... పోర్టర్ల వంటి అనిశ్చిత ఉద్యోగాల్లోకి నెట్టబడ్డారని రాహుల్ గుర్తించారన్నారు. క్రమబద్ధ ఉపాధిని కల్పించడంలో మోదీ ప్రభుత్వం భారీ వైఫల్యమే ఈ పరిస్థితికి దారితీసిందని రమేశ్ అన్నారు. 2021-22తో పోలిస్తే క్రమబద్ధ ఉపాధి 2019-20 కంటే 5.3 శాతం తక్కువగా ఉందంటూ... ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) డేటాను రమేశ్ ఉదహరించారు. ఇక 2019-20 నుంచి 2021-22 వరకు ఉపాధి సంస్థల సంఖ్య భారీగా 10.5 శాతం తగ్గిందని వెల్లడించారు. అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం నుండి వచ్చిన నివేదిక ప్రకారం... 2021-22లో 25 ఏళ్లలోపు గ్రాడ్యుయేట్లలో 42 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారని చెప్పారు. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) డేటా ప్రకారం... తయారీ రంగంలో ఉద్యోగాలు 2017, మార్చి 2023 మధ్యకాలంలో 31 శాతం పడిపోయాయని తెలిపారు. ఆగస్టు 2022 నాటికి 9.8 లక్షల కేంద్ర ప్రభుత్వ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన చెప్పారు. సీఎంఐఈ డేటా ప్రకారం 2015-16 మరియు 2022-23 మధ్య ప్రభుత్వ ఉద్యోగాలు 20 శాతం తగ్గాయి. భారతదేశం ఇప్పుడు ప్రతి 1000 జనాభాకు అమెరికా, బ్రెజిల్, చైనా కంటే కూడా తక్కువగా అతి తక్కువమంది ప్రభుత్వ ఉద్యోగులను కలిగి ఉంది. 'ఉపాధి సంక్షోభాన్ని ఎదుర్కోవడం కంటే, మోదీ ప్రభుత్వం డేటాను దాచడం... వక్రీకరించడం, జిమ్మిక్కులపై దృష్టి సారించడంలో బిజీగా ఉంది. ఈపీఎఫ్ఓ డేటా ద్వారా స్థిరమైన వార్షిక అంచనాలపై ఆధారపడకుండా... వారు విశ్వసనీయత లేని నెలవారీ డేటాను ప్రచారం చేస్తున్నారు' అని రమేశ్ వెల్లడించారు. 'ప్రభుత్వ ఉద్యోగాలను అందించడంలో ప్రభుత్వ వైఫల్యాలను మరింత కప్పిపుచ్చడానికి, ప్రధానమంత్రి వ్యక్తిగతంగా రోజ్‌గార్ మేళాలను నిర్వహించి సాధారణ ప్రభుత్వ పనితీరును పూర్తిగా అపహాస్యం చేశారు. ప్రభుత్వ రంగంలో దాదాపు 10 లక్షల ఖాళీలు ఉన్నప్పటికీ, మోదీ ప్రభుత్వం ఇప్పటికే మంజూరైన పోస్టుల కోసం 50,000 ఉద్యోగ లేఖలను సిద్ధం చేసి ఉపాధిని సృష్టిస్తున్నట్లు పెద్ద ప్రచారానికి పాల్పడుతోంది'అని రమేశ్ స్పష్టం చేశారు. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్ఎస్ఎస్ఓ) ఏప్రిల్ 2023 నివేదిక ప్రకారం భారతదేశంలో 33 శాతం మంది యువతకు ఉద్యోగం లేదన్నారు. విద్య లేదా శిక్షణా కోర్సులు లేవని తెలిపారు. దీని విషాదకరమైన పరిణామం ఏమిటంటే... యువత ఆత్మహత్యల రేటు (30 ఏళ్లలోపు) 2016 నుంచి బాగా పెరుగుతోందన్నారు. 2021లో లక్ష జనాభాకు 4.9శాతానికి చేరుకుందని 25 ఏళ్లలో అత్యధికమని రమేశ్ చెప్పారు. మహిళల్లో ఈ సంఖ్య 50 శాతానికి పైగా పెరిగిందని చెప్పారు. మోదీ ప్రభుత్వం భారతదేశ యువత ఆశలు, కలలను తుడిచిపెట్టిందని విమర్శించారు.

పాదరక్షలు, అనుబంధ పరిశ్రమల దేశవ్యాప్త నిరసన

కొచ్చి : అన్ని రకాల పాదరక్షలపై బీఎస్ఐ నాణ్యత ధ్రువీకరణను కేంద్ర ప్రభుత్వం విధించడాన్ని వ్యతిరేకిస్తూ 13 రాష్ట్రాలకు చెందిన పాదరక్షల తయారీదారులు, అనుబంధ పరిశ్రమలు నిరసన తెలిపాయి. ఆలిండియా ఎంఎస్ఎంఈ ఫుట్‌వేర్ కౌన్సిల్ బుధవారం దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శన నిర్వహించింది. కోజికోడ్‌లోని మోడ్రన్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో రాష్ట్ర స్థాయి నిరసన కార్యక్రమం జరిగింది. కేరళ వ్యాప్తంగా 400 చిన్న తరహా పాదరక్షల యూనిట్లు కూడా నిరసనలో పాల్గొన్నాయి. ప్రభుత్వ నిర్ణయం ఆచరణాత్మ కమైనది లేదా శాస్త్రీయమైనది కాదని పరిశ్రమ నాయకులు, యజమానులు ఎత్తి చూపారు. 'తయారీ/ ఉత్పత్తి ప్రక్రియ, ఉపయోగించిన ముడి పదార్థాల రకాలు, పాదరక్షల ఉత్పత్తుల వర్గాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రమాణాలు ఖరారు చేశారు. బీఐఎస్ ప్రమాణాల అమలును అవాస్తవంగా చేస్తుంది' అని ఆల్ ఇండియా ఎంఎస్ఎంఈ ఫుట్‌వేర్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ వీకేసీ రజాక్ అన్నారు.

మున్సిపల్ వ్యర్థాలతో రోడ్ల నిర్మాణం

త్వరలో ఖరారు చేస్తామన్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

న్యూదిల్లీ : రోడ్డు నిర్మాణంలో మునిసిపల్ వ్యర్థాలను వినియోగించే విధానాన్ని తమ మంత్రిత్వ శాఖ ఖరారు చేస్తోందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శిలాజ ఇంధనాలను ఉపయోగించకుండా నిర్మాణ పరికరాల తయారీదారులకు ప్రోత్సాహకాలు అందించడాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. మునిసిపల్ వ్యర్థాలను రోడ్డు నిర్మాణంలో వినియోగించే విధానాన్ని ఖరారు చేస్తున్నామని తెలిపారు. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని, ఖర్చును తగ్గించడానికి నిర్మాణ సామగ్రిలో ప్రత్యామ్నాయ ఇంధనాన్ని ఉపయోగించడాన్ని ప్రోత్సహించే ముసాయిదా విధానాన్ని తమ మంత్రిత్వ శాఖ రూపొందించిందని గడ్కరీ చెప్పారు. రోడ్డు మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం ఆర్థిక శాఖతో చర్చలు జరుపుతున్నామన్నారు. 'వడ్డీ రాయితీ పథకం వంటి ప్రోత్సాహకాలను రూపొందించవచ్చు, తద్వారా రాయితీదారులు లేదా కాంట్రాక్టర్లు శిలాజ ఇంధనాలకు బదులుగా ప్రత్యామ్నాయ ఇంధనాలతో నడిచే నిర్మాణ పరికరాలలో పెట్టుబడి పెట్టవచ్చు' అని మంత్రి చెప్పారు. రవాణా రంగాన్ని డీకార్బనైజ్ చేసేందుకు తమ మంత్రిత్వ శాఖ అనేక కార్యక్రమాలు చేపట్టిందని, దిల్లీ-జైపూర్ మధ్య ఎలక్ట్రిక్ హైవేలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎలక్ట్రిక్ హైవేలు రైల్వేలు చేసిన విధంగానే వాహనాలకు విద్యుత్ ట్రాక్షన్‌ను అందిస్తాయి. ఇది స్వీడన్, నార్వే వంటి దేశాలలో ప్రబలంగా ఉన్న సాంకేతికతపై ఆధారపడి ఉంటుంది. ఇది పవర్ కేబుల్స్ సదుపాయాన్ని కలిగి ఉంటుంది. ఈ రకమైన సాంకేతికతను అందించే వాహనం ద్వారా వీటిని ఉపయోగించుకోవచ్చు. వాహనం తన ట్రాక్షన్ కోసం ఈ కేబుల్ నుంచి శక్తిని వినియోగిస్తుంది. ప్రస్తుతం, మంత్రిత్వ శాఖ వివిధ సాంకేతికతలను మూల్యాంకనం చేస్తోంది. దేశంలో ప్రత్యామ్నాయ జీవ ఇంధనాల గురించి మాట్లాడుతూ ఇథనాల్ ఆర్థిక వ్యవస్థను రూపొందించడంలో తాను బలమైన ప్రతిపాదకుడిగా ఉన్నానని, వ్యవసాయ వృద్ధిని 6 శాతం పెంచడానికి ఇథనాల్‌ను పెద్ద ఎత్తున తీసుకోవడానికి తాను ఒత్తిడి చేస్తున్నానని గడ్కరీ అన్నారు.

కోనేరు భూ కమిటీ సిఫార్సులు అమలు చేయాల్సిందే

- అక్టోబరులో వలసలపై అనంతపురంలో రాష్ట్ర సదస్సు
- నవంబరులో మహిళా వ్యవసాయ కార్మికుల రాష్ట్రసదస్సు
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ నిర్ణయాలు వెల్లడించిన జల్లి విల్సన్

విశాలాంధ్ర-విజయవాడ: పేదలకు ఆహార భద్రత, సామాజిక గౌరవం కోసం గ్రామీణ కష్టజీవులకు భూ పంపిణీ జరగాలని, అందుకోసం కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను ప్రభుత్వం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. విజయవాడ దాసరిభవన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ భూములు తరిగిపోతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. కార్పొరేట్లు, నయా జమిందార్లు, రియల్టర్లు వ్యవసాయ భూములు కబ్జా చేసి...స్వార్థప్రయోజనాలకు వాడుకుంటున్నారని విమర్శించారు. దాంతో ఆహార భద్రతకు విఘాతం కలుగుతోందన్నారు. దేశంలో 60 శాతం ఉన్న గ్రామీణ కష్టజీవులు, రైతులు, రైతుకూలీలు, కౌలుదారులు, చేతివృత్తిదారులు ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. పేదలకు భూ పంపిణీ ద్వారా ఆహారభద్రత, ఉపాధి లభిస్తుందన్నారు. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల్లో కొన్నింటిని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అమలు చేశారని, ఆయన వారసుడిగా సీఎం జగన్ మిగిలిన సిఫార్సులు అమలు చేయాలని కోరారు. నవరత్నాలుగా ప్రచారం చేస్తున్న సంక్షేమ పథకాలు కమ్యూనిస్టుల పోరాటాల నుంచి ఉద్భవించినవేనని స్పష్టం చేశారు. లక్షల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, దాన్ని సేకరించి పేదలకు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. 50 సంవత్సరాలు నిండిన గ్రామీణ పేదకులు నెలకు రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం భవిష్యత్ కార్యక్రమాలను జల్లి విల్సన్ వివరించారు. గ్రామీణ పేదలకు ఆర్థిక వనరులు కల్పించి వలసల నివారణ కోసం అనంతపురంలో అక్టోబరులో రాష్ట్ర సదస్సు, మహిళా వ్యవసాయ కార్మికుల రాష్ట్ర సదస్సును నవంబరులో విజయవాడలో నిర్వహిస్తామన్నారు. సాగు భూముల సాధన, సాగులో ఉన్న భూములపై హక్కులు కల్పించాలని కోరుతూ వచ్చే ఏడాది జనవరిలో విశాఖపట్నంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తామని చెప్పారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం కింద పని అడిగిన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డులిచ్చి 200 రోజుల పని దినాలు, 600 రూపాయల రోజు వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం 22వ రాష్ట్ర మహాసభల సందర్భంగా 115 మందితో నూతన జనరల్ కౌన్సిల్, 33 మందితో కార్యవర్గసభ్యులు, 15 మందితో ఆఫీస్ బేరర్లను ఎన్నుకున్నట్లు వివరించారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్న దృష్ట్యా వ్యవసాయ కూలీలకు, రైతులకు కరువు సహాయ చర్యలు చేపట్టి ఆదుకోవాలన్నారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006ను సక్రమంగా అమలు చేయాలని, కరువు పరిస్థితులు, వలసల నివారణపై ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు ఆర్.విజయ, డిప్యూటీ జనరల్ సెక్రటరి ఆర్.వెంకట్రావు, కార్యదర్శులు చిలుకూరి వెంకటేశ్వరరావు, కాబోతు ఈశ్వరరావు పాల్గొన్నారు.

హెచ్‌ఈసీ ఉద్యోగులను ఆదుకోండి

ప్రధాని మోదీకి వినయ్ విశ్వం లేఖ

న్యూదిల్లీ: హెవీ ఇంజినీరింగ్ కార్పొరేషన్(హెచ్‌ఈసీ)కు చెందిన 3 వేల మంది ఉద్యోగులకు గడచిన 20 మాసాలుగా వేతనాలు ఇవ్వక పోవడంపై సీపీఐ కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు వినయ్ విశ్వం ఆందోళన వెలిబుచ్చారు. భారతదేశంలోనే సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న సమర్థ వంతమైన ప్రభుత్వరంగ సంస్థ హెచ్‌ఈసీ అని, దేశానికి అద్భుతమైన సేవలు అందిస్తున్న అంతరిక్ష కార్యక్రమంలో దీనిపాత్ర అత్యంత కీలకమై నదని వినయ్ విశ్వం తెలిపారు. విజయవంతంగా ప్రయోగించిన చంద్రయాన్-3కి సంబంధించి లాంచ్ ప్యాడ్ తయారుచేసిన సంస్థ హెచ్‌ఈసీ అని గుర్తుచేశారు. ఇంత అద్భుతమైన సేవలందిస్తున్న హెచ్‌ఈసీ ఉద్యోగులకు వెంటనే వేతనాలు ఇప్పించాల్సిందిగా ప్రధాని నరేంద్రమోదీకి ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం వినయ్ విశ్వం ప్రధానికి లేఖ రాశారు. హెచ్‌ఈసీ ఉద్యోగులకు మొత్తం వేతనం ఒకేసారి చెల్లించేలా జోక్యం చేసుకోవాలని లేఖలో కోరారు. కష్టకాలంలో ఉద్యోగులను ఆదుకోవడానికి ప్రభుత్వం ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. భారతదేశ పారిశ్రామికరంగానికి ఈ ఉద్యోగులు వెన్నెముక వంటివారని, దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న విషయాన్ని మర్చిపోరాదని తెలిపారు. హెచ్‌ఈసీ ఉద్యోగులు విశేష సేవలందిస్తున్నప్పటికీ ఇప్పుడు వేతనాల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడిందని వినయ్ విశ్వం తెలిపారు. జీవనోపాధి కోసం చాలామంది ఉద్యోగులు ఆటో రిక్షా డ్రైవర్లుగా, వీధి వ్యాపారులుగా, రోజువారీ కూలీలుగా పార్టుటైమ్ జాబులు చేసుకుంటున్నారని వివరించారు. కుటుంబాల పోషణ కోసం ఇప్పటికే చాలామంది ఉద్యోగులు ప్రావిడెంట్ ఫండ్ డ్రా చేసుకోవాల్సి వచ్చిందని, రుణాలు తీసుకుంటున్నారని ఆయన చెప్పారు. వేతనాల చెల్లింపులో జాప్యానికి పూర్తిస్థాయి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ లేకపోవడంతో పాటు అనేక కారణాలు ఉండవచ్చని, అయితే, దేశాభివృద్ధిలో విలువైన పాత్ర పోషిస్తున్న ఉద్యోగులు, కార్మికులు తమ తప్పు లేకుండా బాధపడటం ఆమోదయోగ్యం కాదని వినయ్ విశ్వం స్పష్టం చేశారు. భారతదేశ స్పేస్ ప్రోగ్రామ్, ఇతర కీలకమైన పారిశ్రామిక తయారీ రంగం నిర్మాణానికి ఉద్యోగులు తీవ్రంగా కష్టపడ్డారని గుర్తుచేశారు. అలాంటి ఉద్యోగులు అనిశ్చితిలో బతకడం మంచిది కాదని ప్రధానికి వివరించారు.

బిడ్డతో సహా భవనం పైనుంచి దూకిన తల్లి

ఐదేళ్ల బాలుడి మృతి

విశాలాంధ్ర-చిత్తూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో కలత చెందిన ఓ తల్లి...బిడ్డతో సహా సుమారు 30 అడుగుల ఎత్తున్న రెండంతస్తుల భవనం పైనుంచి కిందికి దూకి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం చిత్తూరు నగరంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఐదేళ్ల బిడ్డ మృతి చెందగా తల్లి తీవ్ర గాయాలపాలైంది. వివరాల్లోకి వెళితే... చిత్తూరులోని కొంగారెడ్డిపల్లి నాయి బ్రాహ్మణ కాలనీలో సుమ (32) తన ఐదేళ్ల బాలుడితో కలిసి ఉంటున్నారు. చిత్తూరు నగరపాలక సంస్థలో ఉద్యోగిగా పని చేస్తున్న తన భర్త ఈ ఏడాది ఫిబ్రవరిలో మరణించాడు. ఆ ఉద్యోగం కోసం ఆరు నెలలుగా సుమ ప్రయత్నిస్తుండగా... కట్ట మంచికి చెందిన ఆమె అత్త కుప్పమ్మ, ఆడపడుచు కుమారి ఆమెకు ఉద్యోగం రానీయకుండా నానా రకాలుగా చిత్రహింసలకు గురి చేసేవారని కాలనీ వాసులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురైన సుమ... గురువారం సాయంత్రం కాలనీలో ఉన్న తన స్వగృహం రెండవ అంతస్తు నుంచి ఐదేళ్ల కుమారుడు యశ్వంత్‌తో కలిసి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనలో ఐదేళ్ల బాలుడు యశ్వంత్ అక్కడికక్కడే మృతి చెందగా సుమకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన కాలనీవాసులు... ఆమెను చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సుమ తల్లి ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు చేరుకోగా... బాలుడు మృతిచెందాడని తెలిసి సొమ్మసిల్లి పడిపోయింది.దీంతో ఆమెకు వెంటనే వైద్య సేవలందించి ఇంటికి పంపించేశారు. ప్రస్తుతం సుమ చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేశం మిమ్మల్ని మరచిపోదు

ఎంఎస్ స్వామినాథన్ మృతికి రాష్ట్రపతి, ప్రధాని ప్రభృతుల సంతాపం

న్యూదిల్లీ: ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ మృతి పట్ల యావత్ దేశం తీవ్ర విచారం వ్యక్తంచేసింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ సహా అధికార, విపక్ష నేతలు దేశానికి ఆయన చేసిన విశేష సేవలను స్మరించుకున్నారు. దేశ వ్యవసాయ రంగం పెద్ద దిక్కును కోల్పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపాలు తెలుపుతూ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సందేశాలు వెల్లువెత్తాయి.

అంతులేని ఆవేదనకు గురయ్యా: రాష్ట్రపతి

డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ మరణం తనను అంతులేని విషాదానికి గురిచేసిందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. ఆహార భద్రత కోసం విశేష కృషిచేసిన దార్శనికుడు అని కొనియాడారు. ఆహార ధాన్యాలలో మన దేశానికి స్వావలంబనను చేకూర్చిన హరిత విప్లవ పితామహుడిగా పేరు గడించారని గుర్తు చేశారు. ఇండియన్ అగ్రికల్చరల్ సైన్స్ వారసత్వాన్ని వదలి వెళ్లారని, ఇది మానవాళికి సురక్షితమైన, ఆకలిలేని భవిష్యత్తు వైపు ప్రపంచాన్ని నడిపించేందుకు మార్గదర్శక కాంతి పుంజంగా ఉపయోగపడుతుందని ముర్ము పేర్కొన్నారు.

స్ఫూర్తి ప్రధాత: మోదీ

స్వామినాథన్ మరణం తీవ్ర బాధాకరమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశ చరిత్రలో చాలా సంక్లిష్టమైన సమయంలో వ్యవసాయ రంగంలో ఆయన చేసిన అద్భుతమైన కృషి కోట్లాదిమంది ప్రజల జీవితాలను మార్చేసిందని గుర్తు చేశారు. తద్వారా దేశ ఆహారభద్రతకు భరోసా కల్పించారని తెలిపారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక కృషితో పాటు ఆవిష్కరణలకు ఓ పవర్ హౌస్‌గా ఆయనను పేర్కొన్నారు. పరిశోధనలు, మార్గనిర్దేశంలో ఆయనకు ఉన్న తిరుగులేని నిబద్ధత అసంఖ్యాక శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలపై చెరగని ముద్ర వేసిందని ప్రశంసించారు. డాక్టర్ స్వామినాథన్‌తో సంభాషణ లను తాను ఎల్లప్పుడూ మనసులోనే ఉంచుకుంటానని తెలిపారు. స్వామినాథన్ జీవితం, ఆయన చేసిన కృషి తరతరాలకు స్ఫూర్తిదాయమని కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మర్చిపోలేం: రాహుల్

ఎంఎస్ స్వామినాథన్ మృతికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంతాపం ప్రకటించారు. మన దేశ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చేందుకు స్వామినాథన్ నిబద్ధత, ఆయన చేసిన కృషి ఈరోజు మనల్ని ఆహార ధాన్యాల మిగులు దేశంగా మార్చిందని కొనియాడారు. హరిత విప్లవ పితామహుడిగా ఆయన వారసత్వం ఎప్పటికీ గుర్తుండి పోతుందన్నారు. ఈ కష్టసమయంలో ఆయనను అభిమానించే వారందరికీ తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. దేశానికి ఆయన సేవలను కొనియాడారు.

ఎంఎస్‌పీ సిఫారసు ఆయన ఘనతే: సీపీఎం

ఎంఎస్ స్వామినాథన్ మృతిపట్ల సీపీఎం పొలిట్‌బ్యూరో తీవ్ర విచారం వ్యక్తం చేసింది. దేశానికి ఆయన చేసిన అపార సేవలను కొనియాడింది. 1960లలో అధిక దిగుబడినిచ్చే గోధుమలు, వరి రకాలను అభివృద్ధి చేయడంతో పాటు వాటిని ప్రచారం చేయడంలో ఆయన కృషికి గుర్తింపుగా వరల్డ్ ఫుడ్‌ప్రైజ్‌ను అందుకొన్న తొలి వ్యక్తి ఆయనేనని గుర్తు చేసింది. 1988లో స్వామినాథన్ రీసెర్చి ఫౌండేషన్ ఏర్పాటు చేశారని పేర్కొంది. రైతుల జాతీయ కమిషన్‌కు చైర్మన్‌గా ఉన్న సమయంలో రైతు పండించిన పంటలకు కనీస మద్దతు ధర అందించాలని సిఫారసు చేశారని తెలిపింది. ఉత్పత్తి వ్యయంపై 50శాతం ధర నిర్ణయిం చాలని సూచించినట్లు గుర్తు చేసింది. చారిత్రక రైతుల పోరాటాల్లో ఈ అంశం ఇప్పటికే ఓ ప్రధాన డిమాండ్‌గానే ఉందని ఆవేదన వ్యక్తంచేసింది. ఆ మహనీయుడు కుటుంబ సభ్యులకు, అభిమాను లకు తమ ప్రగాఢసానుభూతి తెలుపుతూ ప్రకటన విడుదల చేసింది.

దేశం మరచిపోదు: తికైత్

డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సేవలను భారతదేశం మరచిపోదని ప్రముఖ రైతు నాయకుడు రాకేశ్ తికైత్ పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికీ, రైతులకు ఆయన చేసిన సేవలు విస్మరించలేమని తెలిపారు. ఆహారభద్రత కోసం ఆయన అహర్నిశలు శ్రమించారని ఎక్స్‌లో పోస్టు చేశారు. దార్శనిక శాస్త్రవేత్త స్వామినాథన్‌ను ఎల్లప్పుడూ గుర్తుంచు కుంటామని చెప్పారు. స్వామినాథన్ మృతివార్త తనను తీవ్రంగా బాధించిందని పేర్కొన్నారు. స్వామినాథన్ ఆలోచ నలు, ఆశయాల కోసం తాము నిరంతరం పోరాడతామని ప్రతినబూనారు. స్వామినాథన్ మృతికి కేంద్రమంత్రులు, దేశంలోని ప్రముఖ రాజకీయ పార్టీల నాయకులు సంతాపం ప్రకటించారు. ఆయన సేవలను కొనియాడారు.

కల్లోల మణిపూర్‌కు శ్రీనగర్ ఎస్ఎస్‌పీ రాకేశ్ బల్వాల్

న్యూదిల్లీ: తీవ్రవాద సంబంధిత కేసులను నిర్వహించడంలో నైపుణ్యం కలిగిన శ్రీనగర్ సీనియర్ పోలీసు సూపరింటెండెంట్ రాకేశ్ బల్వాల్‌ను మణిపూర్ కేడర్‌కు తిరిగి కేంద్రం బదిలీ చేసింది. ఇప్పటికే కల్లోలంగా ఉన్న మణిపూర్ రాష్ట్రం తాజా ఉద్రిక్తలతో పరిస్థితి మరింత దిగజారింది. డిసెంబరు 2021లో అరుణాచల్ ప్రదేశ్, గోవా, మిజోరాం, కేంద్ర పాలిత ప్రాంతం కేడర్‌కు బదిలీ అయిన 2012-బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన రాకేశ్ బల్వాల్‌కు రాష్ట్రంలో చేరిన తర్వాత మణిపూర్‌లో కొత్త పోస్టింగ్‌ను కేటాయిస్తారు. ఈ సంవత్సరం మే నెల నుంచి మెజారిటీ మైతేయి, గిరిజన కుకీ సంఘాల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. 'రాకేశ్ బల్వాల్ ఏజీఎంయూటీ కేడర్ నుంచి మణిపూర్ కేడర్‌కు ముందస్తుగా స్వదేశానికి రావడానికి హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతిపాదనను క్యాబినెట్ నియామకాల కమిటీ ఆమోదించింది' అని ఒక అధికారిక ఉత్తర్వు పేర్కొంది. జమ్ము ప్రాంతంలోని ఉధంపూర్ నివాసి అయిన బల్వాల్... మణిపూర్ పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పని చేశారు. చివరిగా 2017లో చురాచంద్‌పూర్‌లో సీనియర్ సూపరింటెండెంట్‌గా ఉన్నారు. ఆయన థోబల్, ఇంఫాల్ ప్రాంతాల్లో కూడా పని చేశారు. మైనారిటీ ప్రజల హత్యలు, పోలీసులపై దాడులు వంటి అనేక ఉగ్రవాద కార్యకలాపాలు నగరంలో జరుగుతున్న సమయంలో ఆయన శ్రీనగర్ ఎస్ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత బల్వాల్ నగరంలో శాంతిభద్రతల పరిస్థితిని మెరుగుపరచడంపై దృష్టి సారించారు. ఉగ్రవాదుల ఉనికి దాదాపు సున్నాకు తగ్గించడం, మైనారిటీలు లేదా భద్రతా దళాలపై ఎటువంటి దాడులు జరగకుండా చూసుకున్నారు. ఆయన హయాంలోనే మూడు దశాబ్దాల తర్వాత రోడ్లపై మొహర్రం ఊరేగింపును అనుమతించగా, ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని అనుమతించారు. జి-20 టూరిజం వర్కింగ్ గ్రూప్ సమావేశాన్ని నిర్వహించడం వంటి అంతర్జాతీయ కార్యక్రమాలు ఆయన నగర పోలీసు చీఫ్‌గా ఉన్న సమయంలో శాంతియుతంగా జరిగాయి. శ్రీనగర్ ఎస్ఎస్‌పీగా బాధ్యతలు స్వీకరించే ముందు, బల్వాల్ మూడున్నరేళ్లపాటు పోలీసు సూపరింటెండెంట్‌గా ఎన్ఐఏలో డిప్యుటేషన్‌పై ఉన్నారు. 40 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ప్రాణాలు కోల్పోయిన 2019 పుల్వామా ఉగ్రదాడిపై దర్యాప్తు చేసిన బృందంలో సభ్యుడు. జూన్ 1న త్రిపుర కేడర్‌కు చెందిన 1993-బ్యాచ్ ఐపీఎస్ అధికారి రాజీవ్ సింగ్ మణిపూర్ కొత్త పోలీసు డైరెక్టర్ జనరల్‌గా నియమితులయ్యారు. మణిపూర్‌లో చెలరేగిన హింసలో ఇప్పటి వరకు 180 మందికి పైగా మరణించారు. కాగా, జులైలో తప్పిపోయిన ఇద్దరు యువకుల మృతదేహాల ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో మంగళవారం రాష్ట్ర రాజధానిలో ఈసారి విద్యార్థుల నేతృత్వంలో తాజా హింస చెలరేగింది. హింసాత్మక నిరసనల్లో ఆందోళనకారులు గురువారం తెల్లవారుజామున పశ్చిమ ఇంఫాల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయాన్ని ధ్వంసం చేయడంతో పాటు రెండు నాలుగు చక్రాల వాహనాలను తగలబెట్టారని అధికారులు తెలిపారు. బుధవారం రాత్రి, నిరసనకారులు ఉరిపోక్, యైస్కుల్, సగోల్‌బండ్, తేరా ప్రాంతాలలో భద్రతా సిబ్బందితో ఘర్షణ పడ్డారు. పరిస్థితిని నియంత్రించడానికి బలగాలు అనేక రౌండ్ల భాష్పవాయు గోళాలను ప్రయోగించాయని వివరించారు.

షూటింగ్‌లో మరో స్వర్ణం

25 పతకాలతో ఐదో స్థానంలో భారత్

హాంగ్జౌ: ఆసియా క్రీడల్లో భారత్‌కు మరో స్వర్ణం లభించింది. పది మీటర్ల ఎయిర్ పిస్టల్ పురుషుల విభాగంలో సరబ్ జ్యోత్ సింగ్, శివ నర్వాల్, అర్జున్ సింగ్ చీమా తో కూడిన భారత జట్టు బంగారు పతకం సాధించడంతో భారత్ ఖాతాలో ఆరవ స్వర్ణం చేరింది. టీం ఈవెంట్ లో భారత త్రయం 1734.50 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. చైనా 1733.62 పాయింట్లు సాధించి రజతంతో సరిపెట్టుకుంది. అంతేకాదు ఆసియా క్రీడల్లో భాగంగా సరబ్ జ్యోత్ సింగ్, అర్జున్ సింగ్ ఏకంగా టాప్ టెన్ లో అర్హత సాధించారు. సరబ్ జ్యోత్ సింగ్ ఐదవ స్థానంలో ఉండగా..అర్జున్ సింగ్ ఎనిమిదవ స్థానంలో నిలిచాడు. అంతకుముందు వుషు భారత క్రీడాకారిణి రోషిబినా దేవి మహిళల 60 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించింది. కాగా ఈక్వెస్ట్రియన్‌లో వ్యక్తిగత డ్రెస్సేజ్ విభాగంలో అనుష్ గార్వాలా కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. ఆసియా క్రీడల్లో వ్యక్తిగత డ్రెస్సేజ్ ఈవెంట్‌లో భారత్‌కు ఇదే తొలి పతకం. ఈక్వెస్ట్రియన్‌లో ఇప్పటికే భారత్ బంగారు పతకం సాధించిన సంగతి తెలిసిందే. సుదీప్తి హజెలా, హదరు విపుల్, అనూష్ గార్వాలా, దివ్యకృతి సింగ్‌లతో కూడిన భారత బృందం ఈక్వెస్ట్రియన్‌లో డ్రెస్సేజ్ ఈవెంట్‌లో గెలిచి పసిడి పతకాన్ని సొంతం చేసుకున్నారు. ఇక ఆసియా క్రీడల్లో భారత్ సాధించిన పతకాల జాబితాను పరిశీలిస్తే.. భారత్ ఏకంగా 25 పతకాలతో ప్రస్తుతం ఐదవ స్థానంలో నిలిచింది. ఈ 25 పతకాలలో ఆరు బంగారు పత కాలు ఉండగా...8 రజతం, 11 కాంస్య పతకాలు ఉన్నాయి. ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్ క్రీడలలోని అన్ని విభాగాలలో ముందుకు దూసుకు వెళ్తోంది.

చైనాకు భారత క్రికెట్ జట్టు

న్యూదిల్లీ: ఆసియా క్రీడల్లో పాల్గొనేందుకు రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీలోని భారత క్రికెట్ జట్టు గురువారం చైనాకు బయలుదేరింది. భారత క్రికెట్ జట్టుకు వీవీఎస్ లక్ష్మణ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. అక్టోబర్ 3వ తేదీ క్వార్టర్స్‌లో టీమిండియా తన తొలి మ్యాచ్ ఆడనుంది. ఆసియా క్రీడల్లో సీడింగ్ ప్రకారం భారత్ తన తొలి మ్యాచ్‌ను క్వార్టర్స్ స్టేజ్ నుంచి ఆడనున్నది. నేరుగా క్వార్టర్స్ ఆడుతున్న జట్లలో ఇండియాతో పాటు ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, శ్రీలంక జట్లు ఉన్నాయి.

భారత్ జట్టు: రుతురాజ్ గైక్వాడ్(కెప్టెన్), ముకేశ్ కుమార్, శివం మావి, శివమ్ దూబే, ప్రభుసిమ్రన్ సింగ్(కీపర్), యశస్వి జైస్వాల్, రాహుల్ త్రిపాఠి, తిలక్ వర్మ, రింకూ సింగ్, జితేశ్ శర్మ(కీపర్), వాషింగ్టన్ సుందర్, షాబాజ్ అహ్మద్, రవి బిష్ణోయ్, అవేశ్ ఖాన్, అర్షదీప్‌సింగ్.

వన్డే సిరీస్ ట్రోఫీ అందుకున్న కేఎల్ రాహుల్

రాజ్‌కోట్: భారత-ఆస్ట్రేలియా జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా రాజ్‌కోట్‌లోని సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో బుధవారం జరిగిన మూడో వన్డే మ్యాచ్‌లో ఆస్ట్రేలియా విజయం సాధించి తన పరువు నిలబెట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ సిరీస్ లో మొదటి రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన భారత్ 2-1తో సిరీస్ సొంతం చేసుకుంది. అయితే మూడవ మ్యాచ్ ముగిసిన అనంతరం ట్రోఫీ అందజేసే సమయంలో ఆసక్తికర ఘటన జరిగింది. మ్యాచ్ తర్వాత భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ ట్రోఫీని స్వీకరించాల్సి ఉన్నప్పటికీ కానీ తొలి రెండు వన్డేలకు కెప్టెన్ గా చేసిన కేఎల్ రాహుల్ ట్రోఫీ అందుకోవాలని రోహిత్ శర్మ కోరాడు. రోహిత్ శర్మ ప్రదర్శించిన ఔదార్యం పట్ల అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. తొలి రెండు వన్డేలకు కేఎల్ రాహుల్ కెప్టెన్సీ

బాధ్యతలు చేపట్టగా.. మూడవ వన్డే కు రోహిత్ శర్మ కెప్టెన్ బాధ్యతలు వహించాడు. మూడవ మ్యాచ్ 66 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. కేఎల్ రాహుల్ ట్రోఫీ అందుకున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా వైరల్ అయింది. భారత్ మూడవ మ్యాచ్ లో విజయం సాధించి ఆస్ట్రేలియాను క్లీన్ స్వీప్ చేయాలనుకుంది. అయితే సిరీస్ చేజారినప్పటికీ... తమ పరువు నిలబెట్టుకోవాలంటే మూడవ మ్యాచ్‌లో విజయం సాధించాలన్న పట్టుదలతో ఆసీస్ బరిలోకి దిగింది. అనుకున్న విధంగానే ఆస్ట్రేలియా బ్యాటర్లు రాణించారు. ఇక భారత బ్యాటర్లను కూడా ఆస్ట్రేలియా బౌలర్లు కాస్త కట్టడి చేయడంతో విజయం సాధించి సంతృప్తి చెందారు.

ప్రపంచకప్‌కు అక్షర్ స్థానంలో అశ్విన్

ముంబై: ప్రపంచకప్ ఆడే భారతజట్టులోకి దిగ్గజ స్పిన్నర్ అశ్విన్ వచ్చేశాడు. గాయం నుంచి అక్షర్ పటేల్ కోలుకోకపోవడంతో అతని స్థానంలో సెలక్టర్లు 15 మంది సభ్యుల జట్టులోకి అశ్విన్‌ను తీసుకున్నారు. దీంతో రవిచంద్రన్ అశ్విన్ తన కెరీర్‌లో మూడో వన్డే ప్రపంచకప్ ఆడబోతున్నాడు. చివరి నిమిషంలో గాయపడిన అక్షర్ పటేల్ స్థానంలో అశ్విన్ ను సెలక్టర్లు ఎంపిక చేయడం విశేషం. ప్రపంచకప్ లో ఆడబోయే తుది 15 మంది సభ్యుల జట్టును ప్రకటించడానికి గురువారం (సెప్టెంబర్ 28) చివరి తేదీ కావడంతో ఈ ఒక్క మార్పుతో భారత జట్టును మరోసారి సెలెక్టర్లు ప్రకటించారు. ఆసియా కప్ లో అక్షర్ పటేల్ గాయపడటం, ఆ తర్వాత అశ్విన్ ను ఆస్ట్రేలియాతో మూడో వన్డేల సిరీస్ కు ఎంపిక చేయడంతోనే అతడు ప్రపంచకప్ జట్టులోకి రావడం ఖాయమన్న అంచనాలు ఏర్పడ్డాయి. ఆస్ట్రేలియాతో తొలి రెండు వన్డేలు ఆడిన అశ్విన్... మొత్తంగా నాలుగు వికెట్లు తీసుకొని సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. అక్షర్ పటేల్ పూర్తిగా కోలుకోవడానికి మరో మూడు వారాలు పట్టనుండటంతో అతన్ని తప్పించాల్సి వచ్చింది. అయితే ఈ 15 మంది సభ్యుల తుది జట్టును ఎంపిక చేయకముందే టీమ్ తో కలిసి అశ్విన్ తొలి వామప్ మ్యాచ్ జరిగే గుహవతికి వెళ్లాడు. అప్పుడే అతడు జట్టులోకి రావడం ఖాయమని తేలిపోయింది. ఇంగ్లండ్ తో ఇండియా తొలి వామప్ మ్యాచ్ ను శనివారం (సెప్టెంబర్ 30) ఆడనుంది. టీమిండియాలో జరిగిన ఈ మార్పుకు సంబంధించి ఐసీసీ అధికారిక ప్రకటన విడుదల చేసింది.

భారత జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్య, అశ్విన్, రవీంద్ర జడేజా, శార్దూల్ ఠాకూర్, కుల్‌దీప్ యాదవ్, బుమ్రా, షమీ, సిరాజ్

క్రికెట్ ఫీవర్... నేటి నుంచి వార్మప్ మ్యాచ్‌లు

న్యూదిల్లీ: భారత్‌లో మరో వారం రోజుల్లో ఐసీసీ ప్రపంచకప్-2023 ఆరంభం కానున్న క్రమంలో క్రికెట్ ఫీవర్ తారస్థాయికి చేరింది. పుష్కరకాలం తర్వాత ప్రపంచ కప్ ఆతిథ్యానికి టీమిండియా సిద్ధమైంది. ఈ క్రమంలో ఇప్పటికే ఈ మెగా టోర్నీలో పాల్గొనే జట్లు ఒక్కొటొక్కటిగా భారత్ చేరుకుంటున్నాయి. ప్రధాన మ్యాచ్‌ల కంటే ముందు వార్మప్ మ్యాచ్‌లు ఆడేందుకు సన్నద్ధమవు తున్నాయి. హైదరాబాద్, తిరువనంతపురం, గుహవతి ఈ సన్నాహక మ్యాచ్‌లకు వేదికలుగా మారనున్నాయి. సెప్టెంబరు 29 నుంచి అక్టోబరు 3 వరకు జరుగనున్న వార్మప్ మ్యాచ్‌ల షెడ్యూల్, టైమింగ్స్ లైవ్ స్ట్రీమింగ్, టికెట్ల బుకింగ్ తదితర వివరాలు ఈ విధంగా...

సెప్టెంబరు 29, 2023 - శుక్రవారం

- బంగ్లాదేశ్ × శ్రీలంక, బర్సపరా క్రికెట్ స్టేడియం, గువాహటి
- దక్షిణాఫ్రికా × అఫ్గానిస్తాన్, గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియం, తిరువనంతపురం
- న్యూజిలాండ్ × పాకిస్తాన్, రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం, హైదరాబాద్

సెప్టెంబరు 30, 2023- శనివారం

- ఇండియా× ఇంగ్లాండ్, బర్సపరా క్రికెట్ స్టేడియం, గుహవతి
- ఆస్ట్రేలియా × నెదర్లాండ్స్, గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియం, తిరువనంతపురం.

అక్టోబరు 2, 2023- సోమవారం

- ఇంగ్లండ్ × బంగ్లాదేశ్, బర్సపరా క్రికెట్ స్టేడియం, గువాహటి
- న్యూజిలాండ్ × దక్షిణాఫ్రికా, గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియం, తిరువనంతపురం

అక్టోబరు 3, 2023- మంగళవారం

- అఫ్ఘనిస్తాన్ × శ్రీలంక, బర్సపరా క్రికెట్ స్టేడియం, గువాహటి
- ఇండియా × నెదర్లాండ్స్, గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియం, తిరువనంతపురం
- పాకిస్తాన్ × ఆస్ట్రేలియా, రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం, హైదరాబాద్

వార్మప్ మ్యాచ్‌లన్నీ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతాయి.

ఐసీసీ మెన్స్ వన్డే వరల్డ్‌కప్-2023కు సంబం ధించిన వార్మప్, ప్రధాన మ్యాచ్‌లన్నీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం అవుతాయి.డిజిటల్ మీడియాలో డిస్నీ హాట్‌స్టార్‌లో మొబైల్‌లో ఉచితంగా వీక్షించవచ్చు

టికెట్ల అమ్మకం బుక్ మై షోలో...

వరల్డ్ కప్- 2023 ప్రధాన, వార్మప్ మ్యాచ్‌లు కలిపి మొత్తం 58 మ్యాచ్‌ల టికెట్లను బుక్ మై షో ద్వారా కొనుగోలు చేయవచ్చు. టీమిండియా మిన హా ఇతర జట్ల వార్మప్ మ్యాచ్‌లకు టికెట్లు ఆగష్టు 25 నుంచే అందు బాటులోకి రాగా... భారత జట్టు ఆడే వార్మప్ మ్యాచ్‌లకు ఆగష్టు 30 నుంచి అందుబాటులో వచ్చాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.